# క్రీస్తు యొక్క అపొస్తలులు

## SATYA VANI RADIO SERMONS

( Vol. 41 )

JOSHUA GOOTAM

World Literature Publications
SATYA VANI
P.O. Box. No. 80, KAKINADA
India, 533001

# INTRODUCTION

While Christ was on earth he chose twelve men, called apostles, to follow him. He then taught them and trained them so that they might carry on his work after his departure. Each one was an eye witness of Christ, having been with him from the baptism of John until he was taken up into heaven. Each one was also baptized with the Holy Spirit to enable them to remember all of the things that Christ had taught them, to be guided into all the truth, to reveal God's will, to speak in other tongues or languages, and to perform miracles to convince the people that they had been sent of God to proclaim his will. Finally, all of them, except for John, suffered martyrdom for the cause of Christ.

Are there any apostles today? The answer would have to be no since there are none that are able to meet the qualifications of being an apostle. None have been with him from the time of John's baptism up to the time he returned to the Father in heaven, and therefore none today can claim to be eye-witnessess of Christ. Any who would claim to be apostles are imposters and false teachers.

All of this makes for a very interesting study. Many lessons can be derived from the life of each apostle, their background, work, and accomplishments. Bro. Joshua Gootam, the speaker of our Telugu radio program over Radio Sri Lanka, has written concerning the apostles in these series of sermons. You will find them inspiring, informative, and helpful in your study of God's word. These lessons are commended to you.

Although we are not apostles, and neither can we be, we have been blessed by the apostles. They not only took the lead in preaching the gospel and spreading the cause of Christ in the first century, but several of them had a part in writing the New Testament as they were directed and guided by the power of the Holy Spirit. As a result, we have the written word today to read, study, and to obey. Thank the Lord for the apostles, and thank you, Bro. Joshua Gootam, for telling us about them in this series of studies.

New Delhi - 110 049
May, 1988

J.C. CHOATE
Church of Christ

# విషయ సూచిక


| | | | పేజీ |
|---|---|---|---|
| 1. | క్రీస్తుయొక్క అపొస్తలులు | ... | 1 |
| 2. | సీమోను పేతురు-1 | ... | 7 |
| 3. | సీమోను పేతురు-2 | ... | 12 |
| 4. | అంద్రెయ | ... | 18 |
| 5. | జెబెదయి కుమారుడగు యాకోబు | ... | 23 |
| 6. | యోహాను | ... | 29 |
| 7. | ఫిలిప్పు | ... | 35 |
| 8. | బర్తొలొమయి | ... | 40 |
| 9. | తోమా | ... | 46 |
| 10. | సుంకరియైన మత్తయి | ... | 52 |
| 11. | అల్ఫయి కుమారుడగు యాకోబు | ... | 58 |
| 12. | తద్దయి | ... | 63 |
| 13. | జెలోతే అనబడిన సీమోను | ... | 68 |
| 14. | ఇస్కరియోతు యూదా-1 | ... | 73 |
| 15. | ఇస్కరియోతు యూదా-2 | ... | 78 |
| 16. | అపొస్తలుని చిహ్నములు | ... | 84 |
| 17. | అపొస్తలుల పని | ... | 90 |

# 1. క్రీస్తు యొక్క అపొస్తలులు
## ( *The Apostles of Christ* )

క్రీస్తు యొక్క అపొస్తలులను గూర్చి మనము బైబిలు నందు చదువగలము, అపొస్తలుడను మాట 'అపొస్టలాస్' అను గ్రీకు పదము నుండి వచ్చినది. అపొస్తలుడనగా పంప బడిన వాడని యర్ధము. మరి ముఖ్యముగా ఒక ప్రత్యేక పని నిమిత్తము పంపబడినవాడని యర్ధము. సువార్త ప్రకటించు టకు పంపబడు నిమిత్తము యేసు 12 మందిని నియమించు కొనెను (మార్కు 3 : 14). అందువలన వారు అపొస్తలు లనబడిరి. అపొస్తలులను గూర్చి మనము చాల నిర్లక్ష్యము చేయుచున్నాము. వారిని గూర్చి మనము తెలిసికొన గలిగిన దంతా తెలిసికొనలేక యున్నాము. యేసు వారిని నియ మించెను, వారి కాయన బహు జాగ్రత్తగా ఉపదేశించెను మరియు ఆయన ఈ లోకములో పరిచర్య చేసిన కాలములో వారికి శిక్షణ నిచ్చెను. ఆయన వారి సాధక బాధకములను సహించెను మరియు ఈలోకాని కంతటికీ సువార్తను ప్రక టించు బాధ్యతను వారి కప్పగించెను. అందువలన వారు ప్రాముఖ్యమైన వారని మనము గ్రహించుకొన గలము.

ఆ పంద్రెండుగురి పేర్లు యివి: సీమోను పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయ, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, తోమా, అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయి, సీమోను, ఇస్కరియోతు యూదా అనువారు (మార్కు 3 : 16-19).

ఈ పన్నెండుమంది అపొస్తలులు ఆనాటి యూదా మతగురువులలో నుండి నియమింపబడినవారు కారు. వారు నిమ్న జాతులలో నుండి యేర్పరచుకొన బడినవారు కూడ కాదు. గాని వారు సామాన్య ప్రజలలో నుండి, అనగా యేసు యొక్క వాక్యములను ఆనందముతో వినిన సామాన్య ప్రజలలో నుండి యేర్పరచుకొనబడిరి. రబ్బీలవలె వారు విద్యావంతులు కాదుగాని వారు పామరులు మాత్రము కాదు. ఏలయనగా యూదుల పిల్లలందరికీ సమాజ మందిరపు పాఠ శాలలలో ఆనాడు విద్యాభ్యాసము చేయబడుచుండేది గనుక వీరు విద్యలేని పామరులు మాత్రము కాదు.

వారిలో కొందరు, అనగా పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానులు జాలరులు. సీమోను ఒక దోనెను కలిగియుండెను. ఈ దోనెలలో తమతో పనిచేయుటకు వారు కొంతమంది జీతగాండ్రను కలిగి యుండిరి. దీనిని బట్టి వీరు ఆర్థికముగాను, వ్యాపారరీత్యాకూడా వెనుకబడినవారు కారని అర్థమగుచున్నది (మార్కు 1 : 16-20; లూకా 5 : 1-11). మత్తయి ఒక సుంకరి, అనగా పన్ను వసూలు చేయువాడు (మత్తయి 9 : 9; లూకా 5 : 27). అపొస్తలుల జీవితములను గూర్చి వారి వృత్తులను గూర్చి బైబిలు బహు స్వల్ప సమాచారమును మాత్రమే మనకు యిచ్చుచున్నది. వారి యొక్క వ్యక్తిగత చరిత్రకంటె వారి పనిని పరిచర్యను మనము ఎక్కువ తెలిసికొనుట మంచిది.

ద్రోహికంటె ద్వేషింపబడినవాడెవడు బహుశ ఉండడు. మరియు తన యజమానినే అప్పగించిన వాని జీవితము మరింత అసహ్యమైనది. అపొస్తలుల పట్టికలో ఇస్కరియోతు యూదా పేరు ఎప్పుడు ఆఖరిగానే కన్పడును. క్రీస్తే అతనిని యేర్పరచుకొని మిగిలిన వారితో సహా కలసి శక్తినొంది యూదుల దగ్గరికి పంపబడెను (మత్తయి 10:4-15). ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా అను మాటలతో మత్తయి, మార్కు సువార్తలలో అతని పేరు కన్పడును. ద్రోహియగు ఇస్కరియోతు యూదా అని లూకా అతని గూర్చి వ్రాసెను (లూకా 6 : 16). శిష్యుల సమూహపు డబ్బు సంచి అతని యొద్ద ఉండేది. వారి పనికవసరమగు ఖర్చులను, వారి వ్యక్తిగత అవసరముల నిమిత్తమగు ఖర్చులను అతడు చేయుచు యుండేవాడు. అతడు క్రీస్తుయొక్క మిత్రుడే యని చెప్పుకొబడుచున్నను అతడు స్వార్థపరుడు, లోభి యని అగుపడుచున్నాడు. యేసు పాదములకు మరియు జటామాంసి అత్తరును పూసినప్పుడు అతడు అభ్యంతము తెలిపెను. "యీ అత్తరెందుకు మూడువందల దేనారములకు అమ్మి బీదల కియ్యలేదనెను. వాడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధకలిగి కాదు గాని వాడు దొంగయై యుండి తన దగ్గర డబ్బుసంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను" (యోహాను 12 : 1-6). ఇస్కరియోతు యూదా 12 మంది అపొస్తలులలో ఒకనిగా లెక్కింపబడుటయే గాకుండ 'యీ పరి

చర్యలో పాలుపొందెనని' పేతురు చెప్పెను (అపొ. కా. 1:17).

ఇస్కరియోతు యూదాలో సాతానుడు ప్రవేశించెను (యోహాను 13:26). డబ్బుకొరకతడు ప్రభువు నప్పగించెను (మత్తయి 26:15). అటు తరువాత ఉరి పోసుకొని చచ్చెను (మత్తయి 27:5). అతని పాపమును గూర్చి పేతురు చెబుతు యూదా తప్పిపోయెనని చెప్పెను (అపొ. కా. 1:25).

యూదా తప్పిపోయి పోగొట్టుకొనిన పరిచర్యలోను, అపొస్తలులత్వములోను పాలు పొందుటకు మత్తీయ అను నతడు ఏర్పరచుకొన బడుటను అపొ. కా. మొదటి అధ్యాయములో మనము చూడగలము (అపొ. కా. 1:25). అపొస్తలు డగువాడు క్రీస్తుయొక్క పునరుత్థానమును గూర్చి సాక్షియై యుండుట అత్యవసరమని పేతురు పలికెను (అపొ. కా.1:22). అట్టి అర్హతగల వారిలో ఇద్దరని అనగా బర్సబ్బా అనబడిన యోసేపును, మత్తీయ అనువారిని వారు నిలువబెట్టి వీరిద్దరిలో నీవు ఏర్పరచుకొనిన వానిని కనబరచుమని ప్రార్థనచేసి వీరిని గూర్చి చీట్లువేయగా మత్తీయ పేరిట చీటి వచ్చెను గనుక అతడు పదునొకండు అపొస్తలులతో కూడ లెక్కింపబడెను (అపొ. కా. 1:21-26).

ఈ 12 మంది అపొస్తలులను గూర్చియే గాక అపొస్తలుడైన పౌలును గూర్చి కూడ మనము క్రొత్తనిబంధనలో చదువ గలము. అపొస్తలుడగువాడు ప్రభువును

చూచినవాడై యుండవలెను. పౌలు ప్రభువును చూచెను. మన ప్రభువు ఈ లోకమందున్నప్పుడు అతడాయనచే ఉపదేశింప బడకపోయినను అతడు పునరుత్థానుడైన ప్రభువును చూచెను. అయన "అందరికి కడపట ఆకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను" అని పౌలు 1 కొరింధీ 15:8లో చెప్పెను. పౌలు తరువాత ఇంకెవరయిన అపొస్తలులున్న యెడల ఆయన అందరి కంటె కడపట అతనికి కనబడకపోవును. ఆఖరిగ ఆయన పౌలుకు కనబడిన యెడల అటు తరువాత ఇంకెవరికి ఆయన అగుపడలేదు. అందువలన ఈనాడు కొందరు తమ సంఘములో అపొస్తలులను కలిగి యుండుట, అపొస్తలుల మని కొందరు పిలువబడుట లేఖన విరుద్ధమైన సంగతి. ఆకాలమందు పుట్టిన వాడను అని పౌలు తనను గూర్చి చెప్పుకొనుటలో, అతడు సామాన్యముగా అందరి అపొస్తలులవలెగాక అసామాన్యముగా చేయబడిన అపొస్తలుడవని చెప్పుచున్నాడు. ప్రభువు మరణించిన ఆ కొద్ది సంవత్సరముల కాలములోనే అతడు అకాలమందు పుట్టినట్లున్న వాడని అనుకొనిన యెడల ప్రభువు చనిపోయిన రెండువేల సంవత్సరముల తరువాత తాము అపొస్తలులమని చెప్పుకొనువారి సంగతి యేమి? అట్టివారు దొంగ అపొస్తలులేగదా ?

దమస్కుకు వెళ్లు మార్గమున ప్రభువు పౌలుకు కనబడి, "నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను" అని

చెప్పెను (అపొ. కా. 26:16). అపొస్తలత్వమునకు పౌలును ఏ మానవుడు గాక ప్రభువే పిలిచెను. "మనుష్యుని మూలముగానైనను ఏ మనుష్యుని వలనైననుగాక యేసుక్రీస్తు వలనను, దేవుని వలనను అపొస్తలుడుగా నియమింపబడిన పౌలను నేను..." అని అతడు గలతీయులకు తన్ను తాను పరిచయము చేసికొనెను (గలతీ 1:1). మిగిలిన అపొస్తలుల వలె దేవుని బయల్పాటువలన అతడు సువార్తను పొందెను. "నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియ చెప్పుచున్నాను. మనుష్యుని వలన దానిని నేను పొందలేదు, నాకెవడును దానిని బోధింపను లేదుగాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించినది" అని అతడు చెప్పెను (గలతీ 1:12). మిగిలిన అపొస్తలులు అతనికేమియు ఉపదేశించలేదు (గలతీ 2:16) అతడు అన్య జనులకు సువార్తను బోధించుటకై ప్రత్యేకముగా ఏర్పరచుకొన బడిన అపొస్తలుడు (గలతీ 2:7-9).

అపొస్తలులు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను బోధించుటకై ఏర్పరచుకొన బడినవారు. వారు బోధించినది క్రీస్తు సువార్త. ఆ సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని యేసు చెప్పెను. నీవు సువార్తకు లోబడితివా?

# 2. సీమోను పేతురు -1

## (Simon Peter)

యేసు ప్రభువు యొక్క అపొస్తలులలో మొదటిగా సీమోను పేతురు మనకు కనబడుచున్నాడు. "యేసు గలిలయ సముద్ర తీరమున నడుచుచుండగా పేతురనబడిన సీమోను, అతని సహోదరుడైన అంద్రెయ అను ఇద్దరు సహోదరులు సముద్రములో వలలు వేయుట చూచెను; వారు జాలరులు. ఆయన-నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను. వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి" (మత్తయి 4 : 18-20).

సీమోను అనునది హెబ్రీ పేరు. సీమోను పేతురని కూడ పిలువబడేవాడు. పేతురు అనునది గ్రీకు పేరు. పేతురనగా రాయి, చిన్న రాయి యని అర్థము. అంద్రెయ సీమోను పేతురును యేసు నొద్దకు తీసికొని వచ్చినప్పుడు "యేసు అతని వైపు చూచి-నీవు యోహాను కుమారుడవైన సీమోనువు; నీవు కేఫా అనబడుదువని చెప్పెను. కేఫా అను మాటకు రాయి అని అర్థము" (యోహాను 1 : 42). కేఫా అనునది అరామిక్ భాష. కొందరు అపొస్తలులకు ఒకటి కంటె ఎక్కువ పేర్లుండుట మనము చూడగలము. సౌలు పౌలనబడేవాడు. తోమాకు దిదుమ యనే పేరుకూడ ఉండేది.

పేతురు తండ్రి పేరు యోనా, తల్లి పేరు యోహాన్న,

అంద్రెయ అతని సోదరుడు. 1 కొరింథీ 9 : 5ను బట్టి పేతురుకు వివాహమయ్యిందని మనం గ్రహించుకోవచ్చును. పేతురు వృత్తిరీత్యా జాలరుడు. అతడు చేపలకొరకు వలవేయుచున్న సమయంలో యేసు అతన్ని పిలిచాడు. వెంటనే అతడు యేసును వెంబడించాడు. పేతురు గలిలయలోని బేత్సయిదా వాడు. తరువాత అతడు కపెర్నహోములో నివసించాడు. అతడు విద్యావంతుడు కాడు. అపొ. కా. 4 : 13లో పేతురు యోహానులు విద్యలేని పామరులని ప్రజలు గ్రహించినట్టు చూడగలము. అయినను పునరుత్థానుడైన యేసును గూర్చి వారు ధైర్యముగా బోధించారు.

అపొస్తలుల పట్టికలో పేతురు పేరు ఎల్లప్పుడు ముందుగనే కనపడతాది. అతడు యేసుకు సన్నిహితంగా యుండిన అపొస్తలులలో ఒకడు. క్రొత్తనిబంధన గ్రంథములో పేతురు వ్రాసిన మొదటి పత్రిక, రెండవ పత్రిక యున్నాయి. మార్కు సువార్త వ్రాయబడడానికి కారకుడు పేతురేయని అనేకులు భావిస్తారు. సీమోను పేతురు అన్ని విషయాల్లోను మనలాంటి వాడే.

నన్ను వెంబడించుము, నిన్ను మనుష్యులను పట్టు జాలరినిగా చేస్తానని చెప్పి యేసు సీమోను పేతురును పిలిచాడు. అపొస్తలులందరిని యేసు రాజ్యవార్తావాహులుగా ఆయన తయారు చేసాడు. వారందరు గొప్పవారిగా తయారయ్యే శక్తిగలవారే, గాని ఆ శక్తిని యేసు ప్రభువు

మాత్రమే వారిలో గుర్తించాడు. మనుష్యులను పట్టు జాలరిగా తయారవుటలో పేతురు కొన్ని కఠినమైన పాఠాలను నేర్చుకోవలసి వచ్చింది. అతడు తన్ను తాను అదుపులో ఉంచుకోవడం నేర్చుకోవలసివచ్చింది. శిష్యుల నందరినీ అడిగిన ప్రశ్నలకు పేతురు వెంటనే సమాధాన మిచ్చేవాడు (మార్కు 8 : 29), శిష్యులందరు అడగాలనుకొన్న ప్రశ్నల నడిగేవాడు (మార్కు 10 : 28).

"తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దలచేతను, ప్రధాన యాజకుల చేతను, శాస్త్రులచేతను అనేక హింసలు పొంది చంపబడి మూడవ దినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలు పెట్టగా, పేతురు ఆయన చేయిపట్టుకొని ప్రభువా, అది నీకు దూరమగుగాక, అది నీ కెన్నడును కలుగదని ఆయనను గద్దింపసాగెను. అయితే ఆయన పేతురువైపు తిరిగి, సాతానా నా వెనుకకు పొమ్ము; నీవు నాకు అభ్యంతర కారణమై యున్నావు; నీవు మనుష్యుల సంగతులనే తలంచు చున్నావు గాని దేవుని సంగతులను తలంపక యున్నావని పేతురుతో చెప్పెను" (మత్త 16:21-23).

యేసును పట్టుకొనుటకు ఇస్కరియోతు యూదా బహు జనసమూహముతో కూడి వచ్చినప్పుడు పేతురు కత్తి దూసి ప్రధాన యాజకుని దాసుని కొట్టి వాని చెవి తెగనరికెను. "యేసు—నీ కత్తి వరలో తిరిగి పెట్టుము; కత్తిపట్టుకొను వారందరు కత్తి చేతనే నశింతురు" అని చెప్పి అతని గద్దించాడు (మత్త 26 : 47-54).

యేసు ప్రభువు దుష్టుల చేతిలో పట్టుబడుట, విమర్శించబడుట చూచేసరికి పేతురు యొక్క సహజ లక్షణములగు ఉత్సాహ నిరీక్షణలు మాయమై పోయాయి, "నీ విషయమై అందరు అభ్యంతర పడినను, నేను ఎప్పుడును అభ్యంతర పడనని" తన ప్రభువుతో ప్రమాణము చేసిన పేతురు, భూసంబంధమైన అతని నిరీక్షణలు విఫల మవ్వగానే ప్రభువు నెరుగనని ముమ్మారు బొంకాడు. గాని తన ప్రభువు మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని సంతాపపడి యేడ్చాడు (మత్త 26:33-35; లూకా 22 : 62). ఈ విధంగా పేతురు తన్ను తాను తగ్గించుకొనుట నేర్చుకొన్నాడు.

అంతేకాదు యితరులను క్షమించే పాఠాన్ని కూడ పేతురు తన ప్రభువునుండి నేర్చుకొన్నాడు. "ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి—ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నే నెన్నిమారులు అతని క్షమింపవలెను ? ఏడుమారుల మట్టుకా ? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను—ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది వేళ్ల మారుల మట్టుకని నీతో చెప్పుచున్నా ననెను" (మత్త 18 : 21, 22).

తరువాత, దేవుడు లోకంలో యున్న వారందరినీ ప్రేమించుచున్నాడనే గొప్ప పాఠాన్ని సీమోను పేతురు తన పరిచర్యలో నేర్చుకొన్నాడు. కొర్నేలి యింటి వారికి క్రీస్తు సువార్తను ప్రకటించే సందర్భము వచ్చేవరకు, కేవలం

యూదులు మాత్రమే దేవుని దృష్టికి అంగీకార యోగ్యమైన ప్రజలని తలంచాడు. గాని ప్రభువు దర్శనము ద్వారా అందరు సమానులే యని అతనికి నేర్పించాడు. అన్యుడైన కొర్నేలి యింటికి వచ్చి, "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును" అని పేతురు ధైర్యముగా ప్రకటించాడు.

పరలోక రాజ్యద్వారములు, అంటే క్రీస్తు సంఘము యొక్క ద్వారములు తెరచుటకు పేతురుకు రాజ్యపు తాళపు చెవులు ఈయబడెను. మత్తయి 16వ అధ్యాయములో, నేనెవడనని ప్రజలు తలంచుచున్నారు? మీరేమి తలంచు చున్నారు? అని ప్రభువు తన శిష్యులనడిగాడు. "అందుకు సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తు వని చెప్పెను. అందుకు యేసు-సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే కాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టు దును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేర వని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధిం చుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోక మందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను" (మత్తయి 16:16-19). మత్తయి 18:18లో

ఈ అధికారాన్ని ప్రభువు తన అపొస్తులందరికి యివ్వడం చూడగలం.

అయితే క్రీస్తు సంఘము స్థాపింపబడగా దానిలోనికి ప్రవేశించే మార్గాన్ని యూదులకు, అన్యులకు కూడ అపొస్తలుడైన పేతురే మొదట ప్రకటించాడు. పెంతెకొస్తునాడు క్రీస్తునందు విశ్వాసులైన యూదులు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలని అతడు ప్రభువుయొక్క క్షమాపణ వరతువును ప్రకటించాడు. అపొ. కా. 10వ అధ్యాయములో అన్యజనులైన కొర్నేలికి, అతని యింటివారికి పేతురే మరల రక్షణ మార్గాన్ని తెరిచాడు. తద్వారా తన కీయబడిన తాళపు చెవుల ద్వారా (క్రీస్తు సువార్త ద్వారా) పరలోక రాజ్యపు తలుపులు అనగా క్రీస్తు సంఘ తలుపులు పేతురు తెరిచాడు.

పునరుత్థానుడైన ప్రభువు పేతురుకు, మిగిలిన అపొస్తలులకు ఒకగొప్ప ఆజ్ఞ యిచ్చాడు. ఆయాజ్ఞను వారు శిరసావహించారు. లోకమందంతట సువార్త ప్రకటించారు. అపొ. పేతురును గూర్చి వచ్చే పాఠంలో ఇంకా తెలుసుకొందాము.

---

## 3. సీమోను పేతురు-2

### ( Simon Peter )

అపొస్తలుడైన పేతురును గూర్చి కొన్ని సంగతులను గత పాఠంలో నేర్చుకొన్నాము. అతడు గలిలియుడు, జాలరుడు. అయినను ప్రభువతని పిలువగానే సమస్తాన్ని విడిచిపెట్టి

ఆయనను వెంబడించాడు. సీమోను పేతురు తొందరపాటు
గలవాడు, దుడుకు తనం, దురుసు తనం కూడ అతనికి ఎక్కువే,
అయినను ప్రభువును వెంబడిస్తూ తన జీవితంలో గొప్ప
మార్పును సాధించాడు.

పేతురు అపొస్తలులకు లేక శిష్యులకు నాయకునివలె
అగుపడుచున్నాడు. క్రీస్తుతో సన్నిహిత సంబంధము కలిగిన
వారిలో కూడ పేతురు ప్రముఖుడుగ కనబడుచున్నాడు
(మార్కు 5 : 37; లూకా 5 : 2). పేతురు నాయకత్వాన్ని
మన ప్రభువు గుర్తించి సువార్త పరిచర్యలో పేతురుకు
ప్రత్యేక పనుల నిచ్చి ఆయన అతని తలాంతులను వినియో
గించాడు (లూకా 12 : 3). ఆయన మరణించిన తరువాత
తన అనుచరులు తాత్కాలికంగా చెదరిపోవుదురని ప్రభువు
ఎరుగును (మార్కు 14 : 28). గాని తన మనసు తిరిగిన తరు
వాత పేతురు తన సహోదరులను స్థిరపరచవలెనని ఆయన
నిరీక్షించాడు (లూకా 22 : 31).

అపొస్తలుల జాబితాలలో మొదట పేతురును మనం
కనుగొంటాము (మత్తయి 10 : 2). యేసు సమాధిని చూడ
వెళ్లిన స్త్రీలకు కనబడిన దూత ఆయన మృత్యుంజయుడై
లేచిన వర్తమానాన్ని పేతురుకు, శిష్యులకు చెప్పబడవలెనని
కోరాడు (మార్కు 16:7). పునరుత్థానుడైన తరువాత యేసు
ప్రభువు సీమోనుకు కనబడెనని లూకా 14:34 చెప్పుచున్నది.
యేసుక్రీస్తు లేఖనముల ప్రకారము మన పాపముల నిమిత్తము

మృతి బొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెనని అపొ. పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీ 15 :3, 4). అపొ స్తలుల కార్యముల గ్రంథములోని మొదటి పండ్రెండు అధ్యాయములు నిజానికి పేతురును గూర్చి వ్రాయబడిన చరిత్ర; తరువాత అధ్యాయములు పౌలును గూర్చి వ్రాయబడినవి.

పేతురు తొందరపాటు గలవాడయినను తన ప్రభువు నందు గొప్ప విశ్వాసము గలవాడని మనం చెప్పవచ్చు. ఒకనాడు శిష్యులు దోనె యెక్కి ప్రయాణము చేయుచుండిరి. "రాత్రి నాలుగవ జామున ఆయన సముద్రము మీద నడచుట శిష్యులు చూచి తొందరపడి భూతమని చెప్పుకొని భయము చేత కేకలు వేసిరి. వెంటనే యేసు-ధైర్యము తెచ్చుకొనుడి; నేనే భయపడకుడని వారితో చెప్పగా, పేతురు-ప్రభువా నీవే అయితే నీళ్ల మీద నడిచి నీ యొద్దకు వచ్చుటకు నాకు సెలవిమ్మని ఆయనతో అనెను. ఆయన రమ్మనగానే పేతురు దోనె దిగి యేసునొద్దకు వెళ్లుటకు నీళ్ల మీద నడిచెను గాని గాలిని చూచి భయపడి మునిగిపోసాగి ప్రభువా, నన్ను రక్షించుమని కేకలు వేసెను. వెంటనే యేసు చెయ్యిచాపి అతని పట్టుకొని అల్పవిశ్వాసీ యెందుకు సందేహపడితివని అతనితో చెప్పెను" (మత్త 14 : 22-32).

యేసు ప్రభువు సమాధి చేయబడి మృత్యుంజయుడై లేచిన తరువాత మొదట పేతురుకు తరువాత పండ్రెండుగురికి

ప్రత్యక్షుడయ్యేను. ఆయన ప్రత్యక్షుడై నందున ఒక నూతన సహవాస మేర్పడెను. ఆయన తన శ్రమల యొక్కయు మరణము యొక్కయు భావమును మరల వారికి వివరించాడు. ఇప్పుడు వారాయనను గ్రహించుకోగల్గిరి (లూకా 24:44-47). పేతురు మరల విశ్వసించిన ఈ సమూహము యొక్క నాయకు డయ్యాడు. క్రీస్తు మరణము యొక్క యథార్థ భావాన్ని అతడు గ్రహించుకొన్నాడు.

యేసు ప్రభువు యొక్క శ్రమలలోని ప్రత్యేక ఆంత ర్యాన్ని పేతురు గ్రహించుకో గలిగాడు. మానవుని పాప ములను భరించుచు యేసు దేవుని సేవకునివలె మరణించాడు. ఆయన పరిశుద్ధ నీతిమంతునిగా మరణించాడు. తన మరణము ద్వారా ఆయన మానవులందరికీ ఉపకారి అయ్యాడు. యేసు శ్రమలను భరించిన దేవుని కుమారుడనే ఈ ఆంతర్యభావము పేతురు చేసిన ప్రబోధములలో ప్రాముఖ్యాంశముగ కనబడు చున్నది (అపొ.కా. 3:13-15; 4:25; 1 పేతు 2:21-24).

అపొ. కార్యములు 15వ అధ్యాయములో చివరిగా పేతురును గూర్చి మనము చదువగలము. అతడు రోమా లోను, కొరింధులోను పనిచేసాడని రోమా వాస్తవ్యుడైన క్లెమెంతు వ్రాసాడు. సిరియాలోని అంతియొకయలో అతడు పనిచేసాడని ఇగ్నేషియస్ అను నతడు చెప్పుచున్నాడు. అతడు బబులోను, కప్పదొకియ, పొంతు, గలతీయ మొదలగు ప్రాంత ములలో సువార్త ప్రకటించాడని యూసిబియస్ అనే చరిత్రి

కారుడు చెప్పుచున్నాడు. 1 పేతురు 5:13ను బట్టి అతడు బబులోనులో యుండెనని మనము గ్రహించుకోగలము. పేతురు ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాలకు కూడా వెళ్లాడని మరి కొంత మంది చెబుతారు.

అపొ. పేతురు సిలువ వేయబడుట ద్వారా మరణించాడని చరిత్రను బట్టి మనం తెలుసుకోవచ్చును. యేసుక్రీస్తు కొరకు తాను ఎన్ని శ్రమలైనా అనుభవిస్తానని పేతురు చెబుతూయుండేవాడు. పేతురు మరణించే విధానాన్ని బహుశా యేసుప్రభువు ముందుగనే తెలియజేసాడు. ఆయన పేతురుతో, "నీవు ముసలివాడవైనప్పుడు నీ చేతులు చాచుదువు, వేరొకడు నీ నడుము కట్టి నీ కిష్టము కాని చోటికి నిన్ను మోసికొనిపోవునని నీతో నిశ్చయముగా చెప్పుచున్నానని అతనితో చెప్పెను. అతడెట్టి మరణము వలన దేవుని మహిమ పరచునో దాని సూచించి ఆయన ఈ మాట చెప్పెనని" యోహాను 21 : 18, 19లో వ్రాయబడియున్నది.

పేతురు తలక్రిందులుగా సిలువ వేయబడెనని చరిత్రాధారములు తెలియజేయుచున్నవి. యేసువలె మరణించడానికి తాను అర్హుడను కానని అతడు చెప్పాడు.

పేతురు యేసు ప్రభువు ఏర్పరచుకొనిన గొప్ప అపొస్తలుడు, గొప్ప సేవకుడు, అతని జీవితం మనందరికీ గొప్ప నిరీక్షణ నిస్తున్నది. అతని జీవితం నిండా అనేకమైన ఎత్తుపల్లాలే. అయినను క్రీస్తు పునరుత్థానుడైన తరువాత అతని జీవితంలో

ఇక పల్లపు ప్రాంతాలు లేవు. ఎంతటివానినైనను, ఎంతమందినైనను పేతురు క్రీస్తు సువార్తతో ఎదుర్కొనడానికి సిద్ధమే.

పేతురు జీవితాన్ని బట్టి ఒకడు శిష్యుడుగా జన్మించడు గాని శిష్యుడుగా తయారు చేయబడతాడని మనం గ్రహించుకోవచ్చును. మనల్ని కూడ పేతురువలె దేవుడు మనుష్యులను పట్టు జాలరులుగా చేయగలడు. పెంతెకొస్తునాడు అపొ. పేతురు మొట్టమొదట సువార్త ప్రసంగము చేయుటవలన ఇంచుమించు మూడు వేల మంది బాప్తిస్మము పొందారు. అటు తరువాత అయిదు వేల మంది క్రీస్తు సంఘములో చేర్చబడ్డారు. నిజంగా సీమోను పేతురును దేవుడు ఆశీర్వదించాడు.

అపొ. పేతురుకు ఏ రాజ్యపు తాళపు చెవుల నిచ్చాడో, వాటినే దేవుడు నేడు మనకు కూడ యిచ్చాడు. క్రీస్తు సువార్తను మనందరం కలిగియున్నాము. దానితో మనం యేమి చేయుచున్నాము? ఎంత మందిని క్రీస్తు రాజ్యములోనికి ప్రవేశ పెట్టుచున్నాము? పేతురువలె యేసు ప్రభువును మనం ఎరుగనని చెప్పుకొనుచున్నామా? అట్లయితే మనం కూడ మారుమనస్సు పొందాలి. యేసు ప్రభువుకు మనం చేయుచున్న పరిచర్య యెట్టిది?

పేతురు సామాన్య మానవుడే అయినను క్రీస్తును వెంబడించి ధన్యుడయ్యాడు. నీవు కూడ క్రీస్తును నమ్ముకొని, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందితే ధన్యుడవు కాగలవు!

# 4. అంద్రెయ
## ( Andrew )

మనము యేసు క్రీస్తు అపొస్తలులను గూర్చి నేర్చుకొనడానికి ఆరంభించాము. ఈరోజు అపొస్తలుడైన అంద్రెయను గూర్చి తెలుసుకొందాము. ఒకడు క్రైస్తవుడు అవడానికి, భూమిపై దేవుని చిత్తాన్ని జరిగించడానికి అవుసరమయ్యే లక్షణాలను అపొస్తలులు కలిగియున్నారని క్రీస్తు ఎరిగి యుండెను. అందువలననే ఆయన వారిని పిలిచాడు.

అంద్రెయ ముఖ్యముగా సీమోను పేతురు యొక్క సహోదరుడని ఎరుగబడినవాడు. నాయకుని కుండవలసిన ప్రముఖ లక్షణములు బహుశ అతనికి యుండకపోవచ్చును. సువార్తలలో అంద్రెయకు వెనుక స్థానము ఇయ్యబడినట్లున్నది. యేసుకు సన్నిహితంగాయున్న శిష్యులగుంపుకు ఇతడు వెలుపలయున్నాడు. అంద్రెయ అను పేరుకు మానవత్వము, పురుషత్వము అని యర్థము. అతడు గలిలయలోని బేత్సయిదాకు చెందినవాడు, వృత్తిరీత్యా అంద్రెయ జాలరుడు, అతని తల్లి పేరు యొహన్న, తండ్రి పేరు యోనా.

అంద్రెయను, మరింకొక శిష్యుడును (బహుశ అతడు ఫిలిప్పు కావచ్చును) బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యులుగా యుండిరి. ఒకనాడు యోహాను యేసును వారికి చూపించి "ఇదిగో దేవుని గొర్రెపిల్లయని" ఆయనను వారికి పరిచయం చేసాడు. అప్పటినుండి ఆ యిద్దరు శిష్యులు యేసును

వెంబడించారు. వారిలో ఒకడు అంద్రెయ (యోహాను 1 : 35-42).

అంద్రెయ తన యింటి వారికే యేసును మొదట పరిచయము చేసాడు. అంద్రెయ తన సహోదరుడైన సీమోనును చూచి-మేము మెస్సీయను కనుగొంటిమని అతనితో చెప్పి యేసునొద్దకు అతని తోడుకొని వచ్చాడు (యోహాను 1:41). తరువాత సీమోను పేతురు ఎంత ప్రముఖుడయ్యాడో గత రెండు, మూడు పాఠాల్లో మనం నేర్చుకొన్నాము.

మనము కూడ అంద్రెయ వలె మొదట మన యింటి వారిని క్రీస్తు నొద్దకు తేవడానికి ప్రయత్నించాలి, మనము ప్రభువును ఆయన సంఘమును ఎక్కువ ప్రేమించాలి (మత్త 6 : 33). ప్రతివాడును "దేవునియందు భయభక్తులు కలిగి యుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను, మానవ కోటికి ఇదియే విధి" (ప్రసంగి 12 : 13). ఈ గొప్ప సత్యాన్ని మొదట మనం అవలంబించుచు, యితరులు కూడ దాన్ని అవలంబించే లాగున చూడాలి. క్రొత్త నిబంధనలో అంద్రెయ వ్రాసిన పుస్తకం యేమీ లేదు, అతడు చేసిన గొప్ప ప్రసంగాన్ని గూర్చి కూడ యేమీ వ్రాయబడలేదు. అయితే అతడు సీమోను పేతురును క్రీస్తు నొద్దకు తెచ్చాడు. పేతురు ద్వారా ప్రభువు ఎన్నో గొప్పపనులు చేసాడు. సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యని యేసు యిచ్చిన ఆజ్ఞ మొదట మన యింటి వారితో ఆరంభ మవుతాదని అంద్రెయ నుండి మనం నేర్చుకోగలము.

తరువాత, అంద్రెయ యౌవనులకు క్రీస్తును పరిచయం చేయడం మనం చూస్తాము. యేసు నొద్దకు బహు జన సమూహములు రాగా, వీరు భుజించుటకు ఎక్కడ నుండి రొట్టెలు కొని తెప్పింతుమని ఫిలిప్పును ఆయన అడిగాడు. అయితే అంద్రెయ అయిదు రొట్టెలు రెండు చిన్న చేపలు తన యొద్ద కలిగియున్న యొక చిన్నవానిని యేసు నొద్దకు తెచ్చాడు. యేసు ఆ రొట్టెలను చిన్న చేపలను ఆశీర్వదించగా అయిదు వేల మంది పురుషులు తదితరులు తృప్తిగా భుజించారు. సరి గదా మిగిలిన ముక్కలు 12 గంపలు ఎత్తిరి (యోహాను 6 : 5-13). ఈ చిన్నవాడు క్రీస్తుకు ఎట్లుపయోగ పడగలడో అంద్రెయ అతనికి నేర్పాడు.

యౌవనులు తమ యౌవన కాలమందే క్రీస్తు సేవ చేయగల్గునట్లు మనం వారికి నేర్పాలి. "నీ బాల్య దినములందే నీ సృష్టి కర్తను స్మరణకు తెచ్చుకొనుము" అని ప్రసంగి 12 : 2లో వ్రాయబడియున్నది. "చిన్న పిల్లలారా, మీరు తండ్రిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. తండ్రులారా మీరు ఆదినుండి యున్నవానిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. యౌవనస్థులారా, మీరు బలవంతులు, దేవుని వాక్యము మీయందు నిలుచుచున్నది; మీరు దుష్టుని జయించి యున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (1 యోహా 2 : 14).

అంద్రెయ లాంటివారు ఈ నాడు మన సమాజంలో ఎంతో మంది అవసరం. వారు తమ స్నేహాన్ని పలుకుబడిని వినియోగించి యితరులను క్రీస్తు నొద్దకు తెచ్చేవారు కావాలి. మన యౌవనులు సంఘాలలో పెద్దలుగాను, పరిచారకులుగాను, నాయకులుగాను, బోధకులుగాను తయారు చేయగల్గునట్లు అంద్రెయ లాంటి మనుష్యులు మనకెంతో అవసరం.

అంద్రెయ తన యింటివారికి, యౌవనులకు, యూదులకేగాక గ్రీసు దేశస్థులకును, అంటే అన్యులకును క్రీస్తును పరిచయం చేసాడు. కొందరు గ్రీసు దేశస్థులు ఫిలిప్పు నొద్దకు వచ్చి, "అయ్యా మేము యేసును చూడగోరుచున్నామని అతనితో చెప్పగా, ఫిలిప్పు వచ్చి అంద్రెయతో చెప్పెను; అంద్రెయయు ఫిలిప్పును వచ్చి యేసుతో చెప్పిరి" అని యోహాను 12 : 20-22 లో వ్రాయబడియున్నది. గ్రీసు దేశస్థులను యూదులు ద్వేషించేవారు; అయినను యేసు వారిని ప్రేమించుచున్నాడని అంద్రెయకు తెలుసు. అందువలన వారిని యేసుకు పరిచయం చేయడంలో అతడు వెనుకాడలేదు. నిజానికి క్రైస్తవ్యము యూదులకంటె అన్య జనాంగముల గొప్ప మతమయ్యింది. మరియు గ్రీసు దేశస్థులు అంగీకరించినంత ఉత్సాహముతో యూదులు సువార్తను ఎన్నడు అంగీకరించలేదు. మనము కూడ అంద్రెయవలె అందరికీ సువార్త చెప్పడానికి సంసిద్ధులమై యుండాలి. తరుణము దొరికినప్పుడెల్ల అతడు చేయగలిగిన దంతా ఎంత ఎక్కువ చేయగలడో అంత ఎక్కువ చేసేవాడు అంద్రెయ.

తీర్పునాటికి ఒకడు తనతో తీసికొని పోవుట కిది ఒకమంచి రికార్డు.

అంద్రెయలోని ఈ ప్రత్యేక లక్షణము క్రైస్తవ వర్తమానము యొక్క వెనుకనున్న శక్తులలో ఒకటి. శిష్యుడైన వాడు తనలో యున్న దేవుని వరాన్ని సద్వినియోగ పరచాలి. అతడు తన విద్యను, జ్ఞానమును, సాంఘిక స్థానమును లెక్క చేయక ప్రభువుకొరకు పని చేయాలి.

అంద్రెయను గూర్చి అపొ. కా. 1 : 13లో ఆఖరుగా మనం చదువుతాము. అతడు దక్షిణ రష్యాలో పనిచేసాడని యూసిబస్ అను చరిత్రకారుడు వ్రాసాడు. అతడు పార్తీయుల మధ్యను, ఎఫెసులోను పని చేసాడని మరికొందరు చెబుతారు. అతడు చివరకు సిలువకు కట్టబడి చంపబడ్డాడని చరిత్ర చెప్పుచున్నది. అతని సిలువ × ఆకారములో యుండెను. అందువలన దాన్ని Andrews Cross లేక అంద్రెయ సిలువ అని పిలవడం జరిగింది. అతడు ఆ సిలువపై రెండు మూడు రోజులు వ్రేలాడి క్రీ॥శ॥ 69 నవంబరులో మరణించాడు.

వ్యక్తిగత సువార్త సేవ చేయుగల అనేకమంది మనకవుసరం. క్రీస్తు నెరిగిన ఒకడు మరింకొకనికి ఆయననుగూర్చి చెబితేనే ఆయన రాజ్యం విస్తరిస్తాది. తనలోని క్రీస్తును యితరులతో పంచుకోలేనివాడు క్రీస్తు శిష్యుడు కాడు. అంద్రెయ వలె నీవును క్రీస్తును కనుకొనుము. నీ హృదయాన్ని, జీవితాన్ని ఆయనకు విశ్వాసపూరితమైన విధేయతతో అర్పించుము !!

## 5. జెబెదయి కుమారుడగు యాకోబు

### (James the Son of Zebedee)

అపొస్తలుల జాబితాలో మూడవవాడుగా జెబెదయి కుమారుడగు యాకోబు కనబడుచున్నాడు. అయితే ఈ యాకోబును గూర్చి బైబిలులో బహు స్వల్పమైన సమాచారము మాత్రమే యున్నది. యాకోబు అనునది హెబ్రీ పేరు. ఇతడు బేత్సయిదవాడు. యితని తండ్రి జెబెదయి. తల్లి సలోమి. ఆమె యేసు తల్లియైన మరియ యొక్క సహోదరి. యాకోబు యోహాను లిద్దరు అన్నదమ్ములు. యాకోబు చిన్నవాడు, అయినను యోహానుతో యితని పేరు ఎల్లప్పుడు కలిపి చెప్పబడుచు యుంటాది.

యాకోబు త్వరగా కోపపడేవాడు. యాకోబు యోహానులకు యేసు బోయనెర్గసు అను పేరు పెట్టాడు. బోయనెర్గసు అనగా ఉరిమెడి వారని యర్థము (మార్కు 3 : 17). యేసును చేర్చుకొనడానికి వెనుదీసిన సమరయుల గ్రామముపై ఆకాశమునుండి అగ్ని దిగి నాశనము చేయునట్లు ఆజ్ఞాపించ తలంచిన వీరికి యేసు పెట్టిన వర్ణనాత్మక నామము సరియైనదే (లూకా 9 : 52-54). యేసు ప్రభువు తనకు సన్నిహితంగా యున్న శిష్యులకు మారు పేర్లు పెట్టేవాడు. అవి వారి సహజ తత్వాన్ని వర్ణించేవి. సీమోనుకు ఆయన పేతురు, లేక కేఫా అని పేరు పెట్టాడు. కేఫా అను మాటకు రాయి అని అర్థము (యోహా 1 : 42). అలాగే

యాకోబు యోహానులకు ఆయన బోయనెర్గసు అని పేరు పెట్టాడు. ఈ బోయ నెర్గసులు బహుశ మండే గుణము గల వారు, తృటి కాలములో నిర్ణయాలను గైకొనేవారు, నేరస్థులను వెంటనే శిక్షించే తత్వము గలవారు.

మన ప్రభువు యాకోబును పిలిచినప్పుడు అతడంత నాజూకైనవాడేమీకాదు. గాని అతడు చురుకైనవాడు, సమర్పితుడు. మొరటు లక్షణాలేమైనా యుంటే యేసు ప్రభువు వాటిని నునుపు చేయగలడు. ఆయన యాకోబును నునుపు చేసాడు. యేసుప్రభువు యాకోబును పిలిచినప్పుడతడు తన తండ్రియైన జెబెదయితోను, సహోదరుడైన యోహానుతోను కలసి చేపలు పట్టు తన కుటుంబ వృత్తిలో నిమగ్నుడై యుండెను (మత్త 4:21). బహుశ అతడు బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యుడై యుండవచ్చునని యోహాను 1.35 ను బట్టి గ్రహించుకో గలము. గాని ఏదయినను యేసు అతని పిలిచినప్పుడు యాకోబు వెంటనే ఆయనను వెంబడించాడు. పేతురు యోహానులతో అతడు మన ప్రభువుకు ప్రియుడయ్యాడు.

యూదుల సమాజ మందిరపు అధికారియైన యాయీరు కుమార్తె చనిపోగా యేసు ఆమెను బ్రదికించినప్పుడాయన పేతురు, యాకోబు, యోహానులను మాత్రమే తన వెంట తీసికొని వెళ్లాడు (మార్కు 5:35-42). మరల యేసు ప్రభువు రూపాంతరము పొందినప్పుడు వారాయనతో యున్నారు

(మత్త 17:2). అలాగే గెత్సేమనే తోటలో పేతురు యాకోబు యోహానులను ఆయన వెంటబెట్టుకొని వెళ్లి ప్రార్థించాడు (మార్కు 14:33). యాకోబు యోహానులను గూర్చి చెప్పునప్పుడు సాధారణంగా యాకోబు పేరే మనకు ముందు కనబడతాది. ఈ యిద్దరిలోను యాకోబును గూర్చి మనకు తెలిసింది తక్కువే. అతడు అకాలముగా హతమార్చబడ్డాడు. యాకోబు లిఖించింది యేమీలేదు.

అపో. యాకోబుపై తన తలిదండ్రుల యొక్క ప్రభావము ప్రగాఢంగా యున్నట్లు మనం చూడగలము. అతని తండ్రియగు జెబెదయి మంచి స్థితిలో యున్న జాలరుడు. యేసు ప్రభువు యాకోబు యోహానులను పిలువగా వారు తమ తండ్రియైన జెబెదయిని దోనెలో జీతగాండ్ర యొద్ద విడిచిపెట్టి ఆయనను వెంబడించిరని మార్కు 1:20లో వ్రాయబడియున్నది. యాకోబు తల్లియైన సలోమియైతే చాలభక్తిపరురాలు, ఆమె యేసుప్రభువును ఆరాధించింది. ఆమె ఒకసారి ఆయన యొద్దకు వచ్చి నమస్కారము చేసి, "నీ రాజ్యమందు ఈ నా యిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను, ఒకడు నీ యెడమవైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను" (మత్త 20:20, 21). సలోమి యేసు ప్రభువును చివరివరకు వెంబడించింది. ఆయనకు పరిచారము చేసింది (మార్కు 15:40, 41). యేసు ప్రభువు సమాధి చేయబడిన

తరువాత "విశ్రాంతి దినము గడచిపోగానే మగ్దలేనే మరియయు, యాకోబు తల్లియైన మరియయు, సలోమేయువచ్చి ఆయనకు పూయవలెనని సుగంధ ద్రవ్యములు కొనిరి. వారు ఆదివారమున పెందలకడనేలేచి సమాధి దగ్గరకు వచ్చి ఆయన మృతులలోనుండి పునరుత్థానుడయ్యాడనే శుభ వర్తమానాన్ని తెలిసికొన్నారు (మార్కు 16 : 1-6). సలోమి యేసు క్రీస్తునందు గొప్ప విశ్వాసి గనుకనే తన కుమారులను కూడ ఆయనకు నమ్మకమైన శిష్యులనుగా తీర్చి దిద్దినది. బిడ్డలపై తలిదండ్రుల జీవిత ప్రభావమును ఎవరు కాదన గలరు ?

యాకోబు క్రొత్తనిబంధనలో యేమీ వ్రాయక పోయినను అత్యంత శక్తిగల వర్తమానమును మన కిచ్చి యున్నాడు. అతడు క్రీస్తుకొరకు తన ప్రాణమును అర్పించిన అపొస్తలులలో మొదటి వాడయ్యాడు. రాజైన హేరోదు యోహాను సహోదరుడైన యాకోబును ఖడ్గముతో చంపించాడు (అపొ. కా. 12 : 1, 2). అప్పటికి యాకోబు 17 సంవత్సరములు మాత్రము అపొస్తలుడుగా యున్నాడు. అతడు నాయకుడు గనుక అపవాదితో జరిగే పోరాటములో ప్రథమ పంక్తిలోనే యున్నాడు.

క్రైస్తవ సంఘములో స్తెఫను మొదటి హతసాక్షి అయ్యాడు. అతన్ని యూదులు రాళ్లు రువ్వి చంపారు (అపొ. కా. 7). అతని తరువాత కొద్ది సంవత్సరములలో

యాకోబు అతని వెంబడించాడు. ఆ విధంగా క్రీస్తుకు తమ ప్రాణములతో సాక్ష్యమిచ్చిన వారి పెద్దవరుస ఆరంభమయ్యింది. యేసు వైపు చూచుచు వారు పట్టుదలతో మరణమును ఎదుర్కొన్నారు. కడు వృద్ధుడైన పోలికార్పు యేసును నిరాకరించడమో లేక మరణించడమో ఎంచుకొన వలసిందనగా అతడు, "ఎనభై యారు సంవత్సరముల మట్టుకు నే నాయన సేవకుడను. ఆయన నాకెట్టి కీడు చేయలేదు. నన్ను రక్షించిన నా రాజును నే నిప్పుడు దూషించగలనా?" అని చెప్పి సంతోషముతో క్రీస్తు కొరకు మరణించాడు. అహా. యాకోబు కూడ అల్లే.

యాకోబు అత్యాసక్తిపరుడు, చురుకైనవాడు. గనుక అతడు హతసాక్షి యగుట తేలికైన సంగతికాదు. క్రీస్తు రాజ్యములో యాకోబు యోహానులు శక్తిని ఘనతను కోరారు. గాని యేసు మరణాన్ని వారికి ప్రసాదించాడు. "నేను పొందుచున్న బాప్తిస్మమును మీరును పొందెదరు" అని ఆయన వారికి తెలియజేసాడు (మార్కు 10 : 39). "తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును" అని యేసు ప్రభువు చెప్పిన మాటల భావాన్ని చివరిగా యాకోబు గ్రహించుకొన్నాడు. ఉరిమెడి వాడైన యాకోబు హేరోదు రాజు యొక్క ఖడ్గ ధారవలన సద్దణపబడ్డాడుగాని యేసు క్రీస్తు సువార్త ఎక్కడ రాజ్యము చేయునో అక్కడ ప్రజల హృదయాల్లో అతడు నివసిస్తాడు.

"తన ప్రాణమును రక్షించు కొనగోరువాడు దానిని పోగొట్టుకొనును. నా నిమిత్తమై తన ప్రాణమును పోగొట్టు కొనువాడు దానిని రక్షించుకొనును" అని యేసు ప్రభువు చెప్పాడు (లూకా 9 : 24). నీవు నీ ఆత్మను రక్షించుకోవా లంటే యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. నిత్య జీవానికి అర్హుడవు కమ్ము!!

---

# యోహాను
## ( John )

యేసు క్రీస్తు యొక్క 12 మంది అపొస్తలులను గూర్చి మనం ఈ రేడియో పాఠముల ద్వారా కొంత నేర్చుకొన ప్రయత్నించుచున్నాము. ఈ రోజు అపొస్తలుడైన యోహానును గూర్చి తెలిసికొందము. 'యోహాను' అను పేరుకు యెహోవా కృపగలవాడని యర్థము. అతడు గలిలయలోని బేత్సయిదావాడు, జెబెదయి, సలోమీల కుమారుడు, యాకోబు సహోదరుడు. యోహాను సీమోను పేతురుయొక్క మిత్రుడు, జాలరి పనిలో సహచరుడు కూడ. యాకోబు యోహానులు చేపలు పట్టే వ్యాపారంలో సీమోను పేతురు యొక్క పాలివారని లూకా 5 : 10 చెప్పుచున్నది. అతడు తరుచు సీమోను పేతురు యొక్క ఇంటికి వెళ్లుచుండేవాడు (మార్కు 1 : 29).

యోహాను యేసుకు సన్నిహితంగా యుండిన అపొస్తలులలో ఒకడు. అతడు 'యేసు ప్రేమించిన శిష్యుడని' కనీసం 5 సార్లు క్రొత్తనిబంధనలో చెప్పబడినది (యోహాను 13:23; 19 : 26; 20 : 1; 21 : 7, 20). వారు భుజించుటకై పస్కాను ఒక మేడగదిలో సిద్ధపరచుట కొరకు యేసు పేతురును, యోహానును పంపించాడు (లూకా 22 : 7, 8). యోహాను క్రొత్త నిబంధనలో 5 పుస్తకాలను వ్రాసాడు. అవి: యోహాను సువార్త, యోహాను వ్రాసిన 1వ, 2వ, 3వ పత్రిక మరియు ప్రకటన గ్రంథము.

యేసు ప్రభువుకు జెబెదయి కుమారుడైన ఈ యోహానును బాప్తిస్మమిచ్చు యోహాను పరిచయం చేసాడు. "ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల" యని అతడు యేసును పరిచయం చేసాడు (యోహాను 1:29). యోహాను యేసుతో ఒక దినం గడిపాడు. అటు తరువాత అతడాయన వెంట కానా యను ఊరికి, కపెర్నహూముకు, యెరూషలేముకు వెళ్లాడు యేసు నీకొదేముతోను, యాకోబు బావి దగ్గర సమరయ స్త్రీతోను సంభాషించి నప్పుడతడు ఆయనతోనే యున్నాడు (యోహాను 2-4 అధ్యా).

యేసుతో సహవాసము చేయుటవలన యోహాను తన జీవితాన్ని సంపూర్తిగా మార్చుకొన్నాడు. అతడు నునుపు చేయబడని వజ్రమువలె యుండెను. అతడు అత్యాసక్తి, అభిలాషగల పనివాడు. "బోధకుడా మేము అడుగునదెల్ల నీవు మాకు చేయ గోరుచున్నామని" యాకోబు యోహానులు ఆయనను అడిగారు (మార్కు 10:35). అతడు చురుకైన కోపము గలవానిగను (లూకా 9:51-57), స్వల్ప సహనము సంకుచితావగాహనము గలవానిగను తన శిష్యత్వపు తొలి రోజుల్లో మనకగుపడతాడు. ఉదాహరణకు యోహాను యేసుతో "బోధకుడా, ఒకడు నీ పేరట దయ్యములను వెళ్లగొట్టుట చూచితిమి; వాడు మనలను వెంబడించువాడు కాడు గనుక వానిని ఆటంకపరచితిమని" చెప్పాడు (మార్కు 9:38-41). వాని నాటంకపరచవద్దని యేసు అతనికి చెప్పాడు. ఇతనికున్న స్వల్ప సహనాన్ని బట్టి చిరకోపాన్ని బట్టి బోయనెర్గెసు అను

పేరును యేసు యాకోబుకు యోహానుకు పెట్టాడు. బోయ నెర్గను అనగా ఉరిమెడు వారని అర్థము (మార్కు 3:17, 18). మిగిలిన అపొస్తలుల వలె యోహాను కూడ గెత్సెమనె వనంలో యేసును విడిచి పారిపోయాడు (మత్త 26 : 56).

అయినను యోహాను సువార్త, పత్రికలు వ్రాసేసరికి యేసుతో సంచరించి సంభాషించిన యౌవన కాలపు యోహాను కంటె బహుగా మార్పు జెందిన వానిని మనము చూడగలము. తాను వ్రాసిన వ్రాతలు క్రీస్తు పరమున కారోహణుడైన అనేక సంవత్సరముల తరువాత వ్రాసాడు. మరియు తన ప్రభువు బోధలను తన జీవితంలో అలవరచుటకు ప్రయత్నించిన తరువాత వ్రాసాడు. ప్రేమను గూర్చి యేసు చెప్పిన దానిని యోహాను ప్రత్యేకంగా గ్రహించుకొన్నాడు. యేసు చేసిన పని యంతటికీ ప్రేమ కేంద్రీకృతమై యున్నది. అందు వలన యోహాను వ్రాతలు ప్రేమ ప్రభావితములై యున్నవి.

"తన శిష్యులకు తన ప్రాణము పెట్టు వానికంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు" అని యేసు ప్రభువు బోధించాడు (యోహా 15:13). యేసు తన శిష్యుల యెడల యిదే పనిని గావించాడని యోహాను గ్రహించాడు. ప్రభువు శిష్యులు ఒండొరుల యెడల త్యాగపూరిత జీవితం జీవించాలని యోహాను తెలిసికొన్నాడు. యేసుప్రభువు నామము కొరకు శ్రమలనుభవించుట గొప్ప ధన్యతయని అతడు భావిం

చాడు (అపో.కా. 5:41). యూదుల పెద్దలు, అధికారులు, శాస్త్రిలు, ప్రధాన యాజకులు మొదలైనవారు పేతురు యోహానులను పట్టుకొని యేసు నామమును బట్టి యెంత మాత్రము మాటలాడకూడదు, బోధింపను కూడదని ఆజ్ఞాపించారు. "అందుకు పేతురును, యోహానును వారిని చూచి దేవుని మాట వినుటకంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పండి. మేము కన్నవాటిని, విన్న వాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తర మిచ్చిరి" (అపో.కా. 4:17-20). చివరిగా ప్రకటన గ్రంథాన్ని వ్రాస్తూ, మీ సహోదరుడను, యేసును బట్టి కలుగు శ్రమలలోను రాజ్యములోను సహనములోను పాలివాడనునైన యోహానను నేను దేవుని వాక్యము నిమిత్తమును యేసును గూర్చిన సాక్ష్యము నిమిత్తమును పత్మాసు ద్వీపమున పరవాసినై తిని" యని చెప్పాడు (ప్రక 1:9).

అపో. యోహాను దేవుని ఎక్కువ ప్రేమించాడు. అతడు బోధించేది ధైర్యముగా బోధించేవాడు (అపో. కా. 4 : 13). యేసు సిలువ మీద వ్రేలాడుచు తన తల్లి యొక్క బాధ్యతను యోహానుకు అప్పగించాడు. "యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి - అమ్మా యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను. తరువాత, శిష్యుని చూచి-యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియ నుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను" (యోహాను 19 : 25-27).

యోహానును ప్రేమ అపొస్తలుడని మనం చెప్పుకో వచ్చును. "దేవుడు ప్రేమా స్వరూపి; ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు" అని అతడు బోధించాడు (1 యోహాను 4:8). యేసు ప్రభువు పునరుత్థానుడైన దినమందు ఆయన సమాధి దగ్గరకు ముందుగా పరుగెత్తి వెళ్ళినవాడు యోహాను (యోహాను 20:4). యేసుప్రభువు మృతులలో నుండి తిరిగి లేచినాడని నమ్మినవారిలో యోహాను మొదటివాడు (యోహా 20:8). క్రీస్తు సువార్త నిమిత్తము అతడు తన వృద్ధాప్యంలో పత్మాసు ద్వీపములో డొమిషియన్ చక్రవర్తి కాలములో ప్రవాసిగా బంధింపబడ్డాడు. అక్కడ ఇంచుమించు 18 మాసములు అతడు గడిపాడు. ఆ కాలములోనే ప్రకటన గ్రంధాన్ని వ్రాసాడు. అయితే నేర్వా చక్రవర్తి పాలనలో అతడు విడుదల చేయబడ్డాడు.

యోహాను ఎఫెసుకు తిరిగి వచ్చాడు. మోషే వలె వయస్సు మీరిన తరువాత మరింత ఎక్కువ పనిచేసాడు. అతడు 90 సం॥లకు పైగా జీవించాడు. అతడు పార్థియాలోను, తుర్కు దేశములోను, ఇరాన్ దేశములోను క్రీస్తు కొరకు పని చేసాడు. యోహాను రష్యాలో కూడ క్రీస్తును ప్రకటించాడని కొందరు చెబుతారు.

అపొస్తలులందరి కంటె ఆఖరున యోహాను మరణించాడు. మిగతా వారందరు హతసాక్షులై మరణించారు గాని యోహాను స్వాభావికంగానే మరణించాడు. యేసుప్రభువు

మరణించిన తరువాత యోహాను 68 సం॥లు మట్టుకు జీవించాడు. యోహాను సమాధి ఎక్కడ ఉన్నదో ఎవరికీ తెలియదు.

యేసుతో కూడ యుండుట వలన ఒకని తత్వమంతయు మంచికొరకు మారగలదని యోహాను జీవితం తెలియజేయుచున్నది. క్రీస్తును తెలిసికొనుట దేవుని ప్రేమను తెలిసికొనుటయే. ఒకడు యేసుప్రభువు నందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందిన యెడల దేవుని ప్రేమకు పాత్రుడగును. నీవు నీ జీవితాన్ని మార్చుకోగోరుచున్నావా ?

# 7. ఫిలిప్పు
## (PHILIP)

యేసును వెంబడించిన పండ్రెండు మంది అపొస్తలు లలో ఫిలిప్పు ఒకడు. గ్రీకు భాషలో ఫిలిప్పు అను పేరుకు గుర్రములను ప్రేమించువాడని యర్థము. అతడు బేత్సయిదా వాడు. చతుర్ధాదిపతియైన ఫిలిప్పును బట్టి అతనికి పేరు పెట్ట బడిందని కొందరు అనుకొందురు. నతనియేలు ఫిలిప్పుయొక్క సహోదరుడు కావచ్చును. యేసు ఏర్పరచుకొనిన అపొస్తలు లలో కనీసం అయిదుగురు బేత్సయిదా వారు. "అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా, మీ మధ్యను చేయబడిన అద్భుతములు తూరు సీదోను పట్టణములలో చేయబడినయెడల ఆ పట్టణములవారు పూర్వమే గోనెపట్ట కట్టుకొని బూడిద వేసుకొని మారుమనస్సు పొంది యుందురు" అని ఒక సందర్భ ములో యేసుప్రభువు విచారించినందున బేత్సయిదా నుండి అయిదుగురు అపొస్తలులను ఆయన ఏర్పరచుకొనడం ఆశ్చ ర్యంగానే యున్నది.

అపొస్తలుడైన ఫిలిప్పు పేరు మట్టుకే మత్తయి మార్కు సువార్తలలోను, అపొస్తలుల కార్యములలోను కనబడతాడు. యితడు అపొస్తలుల కార్యములు 8వ అధ్యా యములో కనబడు సువార్తికుడైన ఫిలిప్పు కాదు, అయితే యోహాను సువార్తలో ఫిలిప్పును గూర్చిన కొంత వివరణ మనకు దొరుకుతాది.

ఫిలిప్పు సత్యాన్ని అన్వేషించువానిగ మనకు కనబడ తాడు. అతడు వెదుకువాడు. యేసు అతనిని కనుగొన్నాడు. నశించిన గొర్రెలను వెదకుచు వచ్చిన కాపరి యేసుప్రభువు ఆయన పాపపు రోగము గలవారికొరకు ఈ లోకానికి వచ్చాడు. "నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతు లను పిలువరాలేదని" ఆయన చెప్పాడు (మత్త 9 : 12, 13). ఫిలిప్పు యేసుప్రభువును వెదికాడు. "ఫిలిప్పు నతనియేలును కనుగొని-ధర్మశాస్త్రములో మోషేయు ప్రవక్తలును ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని అతనితో చెప్పాడు" (యోహాను 1 : 45). ఫిలిప్పు యేసు ప్రభువును కనుగొన్న ప్పుడు అతడు నతనియేలును వెదికాడు, క్రీస్తు నొద్దకు అతన్ని తీసికొనివచ్చాడు. అలాగే కొందరు గ్రీసుదేశస్థులు యేసును చూడగోరినప్పుడు ఫిలిప్పు ఆ సంగతి అంద్రెయకు చెప్పాడు. అంద్రెయ వారిని క్రీస్తుకు పరిచయం చేసాడు (యోహా 12 : 21, 22). వ్యక్తిగత పరిచర్యవలన మానవులను క్రీస్తు నొద్దకు మనం నడిపించగలమని ఫిలిప్పు జీవితం మనకు తెలియ జేయుచున్నది. యౌవనుడైన తిమోతిని కూడ పౌలు ఇట్లు హెచ్చరించాడు: "నీవు అనేక సాక్షుల యెదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" (2 తిమో 2 : 2). ఒక వ్యక్తినుండి ఇంకో వ్యక్తికి క్రీస్తు సువార్త అందియ్య బడాలి.

ఫిలిప్పు యొక్క విశ్వాసాన్ని ఒకమారు యేసుప్రభువు పరీక్షించాడు. ఒకనాడు ఆయన దగ్గరకు బహుజనులు కూడి వచ్చుట చూచి "వీరు భుజించుటకు ఎక్కడనుండి రొట్టెలు కొని తెప్పింతుమని ఫిలిప్పు నడిగాడు" (యోహాను 6 : 5,6). ఆయన యేమి చేయనైయుండెనో తానే యెరిగియుండి అతని పరీక్షించుటకు ఆలాగడిగెను. అయితే వారందరికి ఆహారము పెట్టడానికి సరిపడే డబ్బు వారిదగ్గర లేదని అతడు జవాబిచ్చాడు. యేమీలేక పోయినా యేసుక్రీస్తు ఉంటే చాలుననే సంగతిని తాత్కాలికంగా ఫిలిప్పు మరచాడు. యేసు ప్రభువు ఆనాడు ఐదు రొట్టెలు రెండు చేపలతో అయిదువేల మందికి ఆహారము పెట్టాడు.

ఫిలిప్పును పరీక్షించినట్లే ప్రభువు మనల్ని కూడ పరీక్షించవచ్చును. అందుకే మొదటి శతాబ్దపు క్రైస్తవులకు పేతురిట్లు వ్రాసాడు: "ప్రియులారా మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదో యొకవింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలు పరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి" (1 పేతురు 4 : 12, 13). నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుకొనుడి" యని

యాకోబు చెప్పాడు (యాకో 1:2, 3). మన విశ్వాసము పరీక్షింపబడినప్పుడు మనము మరింత బలపడుదుము గాక.

యేసుప్రభువు తన 12 మంది శిష్యులను విడిచి వెళ్ళిపోబోవుచున్నానని చెప్పినప్పుడు వారిలో కొందరు వివిధ భావాలను వ్యక్తపర్చారు. పేతురు ఆయనను వెంబడించాలనుకొన్నాడు. తోమా ఆయన వెళ్ళేచోటుకు మార్గము తెలిసికోగోరాడు. ఫిలిప్పయితే, "ప్రభువా తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ఆయనతో అన్నాడు" (యోహా 14:8). కనబడేలాగున దేవుని చూడాలనుకొనడంలో అతడు స్వల్ప విశ్వాసివలె కనబడుచున్నను, యేసు ఒక్కడే దేవుని కనబరచగలడని అతడు నమ్ముటలో గొప్ప విశ్వాసాన్ని కనబరచాడు. దేవుని లక్షణములైన ప్రేమ, పవిత్రత, దయ, సత్యము, న్యాయము మొదలగున వన్నియు మొదటినుండి ఆయనలో కనబడుచున్నందున, నేనే దేవుని బయల్పాటునని క్రీస్తు అతనికి జవాబిచ్చాడు. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" అని ఆయన చెప్పాడు (యోహాను 14:9). నిజానికి దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తు నందు వెల్లడిపరచాడు (2 కొరింథి 4:6).

ఒకానొకప్పుడు క్రైస్తవులు తండ్రియైన దేవుని చూస్తారు. "ప్రియులారా యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది యింక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన

యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలి యుందుమని యెరుగుదుమని" యోహాను వ్రాసాడు (1 యోహా 3 : 2). మరల పరలోకమందు "ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేయుచుందురు; ఆయన నామము వారి నొసళ్ల యందుండును" అని అతడు ప్రక 22 : 4 లో వ్రాసాడు.

అపొస్తలుడైన ఫిలిప్పు జీవితము శక్తితోను ఆత్మీయ విజయముతోను నిండిన జీవితము. అతడు ఆసియాలో తన కృషిని కేంద్రీకరించినట్లు చారిత్రక సాంప్రదాయము వలన తెలియు చున్నది. అతడు దక్షిణ రష్యాలోను, ఫ్రాన్స్‌లోను, టర్కీ దేశములోను సువార్త ప్రకటించినట్లు చెప్పబడుచున్నది. చివరిగా అతడు బంధింపబడి, కొట్టబడి, తలక్రిందులుగా సిలువ వేయబడి మరణించాడు. యేసు ప్రభువువలె నిదానముగా సిలువ వేయబడుటకు అర్హుడను కానని అతడు చెప్పాడు.

మనము ఫిలిప్పువలె నిజంగా క్రీస్తును ఆయన సత్యాన్ని అన్వేషించినట్లయితే తప్పక కనుగొందుము. మన విశ్వాసము పరీక్షింపబడవచ్చును. మనం విఫలులమైనను దేవుడు తప్పక సహాయం చేస్తాడు. ఫిలిప్పువలె మనందరం దేవుని చూడ గోరాలి. అట్లయితే యేసు ప్రభువునందు విశ్వాస ముంచి ఆయన ఆజ్ఞలకు లోబడుటయే తప్ప వేరొక మార్గములేదు.

# 8. బర్తొలొమయి
## (BARTHOLOMEW)

క్రొత్త నిబంధన సంఘారంభములో అపొస్తలులు ప్రముఖ పాత్రను వహించారు. యుగయుగములు నిలిచి యుండబోవు క్రీస్తు సంఘానికి పునాదివేయు ఏకైక పని వారి కప్పగించబడింది. వారు మృతులలో నుండి తిరిగి లేచిన ప్రభువును చూచిన సాక్షులు. యేసుప్రభువుచే పంపబడినవారు గనుక అపొస్తలులు. సర్వసృష్టికి సర్వజనాంగములకు క్రీస్తు సువార్తను ప్రకటించుటకు బయలువెళ్లిన మిషనెరీలు. వారు ప్రభువు యొక్క ప్రతినిధుల వలె ఆయన ఆత్మ నడిపింపు చొప్పున పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడిన విశ్వాస మును నెలకొల్పారు. ఇంత గొప్ప పనిని సాధించిన 12 మంది అపొస్తలులలో బర్తొలొమయి ఒకడు. ఇతని పూర్తి పేరు నతనియేలు బర్తొలొమయి.

మత్తయి మార్కు లూకా సువార్తలలోను, అపొస్త లుల కార్యముల గ్రంథములోను బర్తొలొమయి పేరు చెప్ప బడింది గాని నతనియేలను పేరు అక్కడ చెప్పబడలేదు. బర్తొ లొమయి అనగా తొలొమయి కుమారుడని యర్థము. మత్తయి సువార్త 16వ అధ్యాయములో యేసు పేతురును సీమోను బర్‌యోనా అని పిలిచాడు (మత్త 16 : 17). బర్ యోనా అంటే యోనా కుమారుడని యర్థము. యోహాను ఒక్కడు మాత్రమే నతనియేలును గూర్చి వ్రాసాడు.

యోహాను 21:2ను బట్టి నతనయేలు బర్తొలొమయి గలిలయ లోని కానా అను ఊరివాడని మనము గ్రహించుకొనగలము. కానాయను ఊరిలో యేసు వెళ్లిన పెండ్లిలో అతడున్నాడని కొందరు చెబుతారు. ఆ పెళ్లిలో అతడే పెండ్లి కుమారుడని కూడ మరి కొందరు చెబుతారు. ఇదంతా సాంప్రదాయిక మైన చరిత్రే.

నతనయేలను బర్తొలొమయి లేఖనములను పఠించు వాడని సత్యాన్వేషియని మనం గ్రహించుకోవచ్చు. "ఫిలిప్పు నతనయేలును కనుగొని-ధర్మశాస్త్రములో మోషేయు ప్రవక్తలును ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని అతనితో చెప్పాడు" (యోహా 1 : 45). దీనిని బట్టి వీరిద్దరు రాబోవు మెస్సీయను గూర్చి లేఖనములను పరిశోధించుచుండిన వారని అర్థమగుచున్నది.

క్రీస్తును గూర్చిన శుభవార్తను అతనితో పంచుకోడానికి ఫిలిప్పు ఇష్టపడినందున నతనయేలు క్రీస్తునొద్దకు తీసికొని రాబడ్డాడు. అంద్రెయ పేతురులవలె ఫిలిప్పు నతనయేలు కూడ సోదరులై యుండ వచ్చని కొందరు భావిస్తారు. ఒకరు ఇంకొకరికి క్రీస్తును గూర్చి చెప్పుటవలననే ఆయన సువార్త వ్యాప్తి చెందుతాది.

నతనయేలును బర్తొలొమయి యేసును గూర్చి విన్నప్పుడు కొంత సందేహించాడు. మేము మోషేయును కనుగొంటిమి, ఆయన నజరేయుడగు యేసు అని ఫిలిప్పు అతనితో చెప్పినప్పుడు, "నతనయేలు-నజరేతులోనుండి మంచిదేదైనను రాగలదా?" అని అడిగాడు (యోహా 1:46). వచ్చియేసును వెంబడించుమని ఆహ్వానించేసరికి కొంచెము సంశయించినవాడు నతనయేలు ఒక్కడే. అతడు తన బైబిలును బాగుగా యెరిగినవాడు. అందువలన రక్షకుడైన క్రీస్తు బేత్లెహేము నుండి రావలసి యున్నదని ఎరిగినవాడై అట్లన్నాడు (మీకా 5:2). అయితే యేసు ప్రభువు బేత్లెహేములో జన్మించి నజరేతులో పెరిగాడనే సంగతి అప్పటికి అతనికి తెలియదు, ఫిలిప్పు నతనయేలుతో వాగ్వాదమేమీ పెట్టుకోలేదుగాని సూక్ష్మంగా, "వచ్చి చూడుము" అని అతనితో చెప్పాడు.

క్రైస్తవ్యములో దాచుకోవలసిన సంగతి యేమీ లేదు. యేసుక్రీస్తు ఈలోక రక్షకుడు, ఈ భూమిపై ఉద్భవించిన ప్రతివాడు ఆయనను వచ్చి చూడాలి. లేదా ఒకానొక దినమందు ప్రతినేత్రము ఆయనను చూస్తాది. "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు. ప్రతినేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి, రొమ్ము కొట్టుకొందురు; అవును ఆమేన్" (ప్రక 1:7).

నతనయేలు ఏ కపటము లేని మనిషి. అతడు నిష్కల్మషుడు, కల్ల కపటం లేనివాడు, "యేసు నతనయేలు తన యొద్దకు వచ్చుట చూచి-ఇదిగో యితడు నిజముగా ఇశ్రాయేలీయుడు; ఇతనియందు ఏ కపటమును లేదని అతని గూర్చి చెప్పెను" (యోహాను 1:47). "నన్ను నీవు ఏలాగు ఎరుగుదువని నతనయేలు ఆయనను అడుగగా యేసు-ఫిలిప్పు నిన్ను పిలువక ముందే, నీవు ఆ అంజూరపు చెట్టుక్రింద ఉన్నప్పుడే నిన్ను చూచితినని అతనితో చెప్పెను. నతనయేలు-బోధకుడా నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు అని ఆయనకు ఉత్తర మిచ్చెను." (యోహా 1 : 48, 49). నతనయేలు తన్ను తాను మోసగించుకోలేదు (గలతీ 6:7,8). యితరులను మోసగించలేదు. అందుకే "జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను" అని 1 పేతురు 3:10 లో వ్రాయబడి యున్నది. నతనయేలు దేవుని కూడ మోసం చేయలేదు. "ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియులేదు. మన మెవనికి లెక్క యొప్ప చెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగాయున్నది" యని అతడెరుగును (హెబ్రీ 4 : 13).

నతనయేలను బర్తొలొమయి భక్తిపరుడు, అతని కాలంలో ప్రజలు, లేక యూదులు తమ యిరుగ్లను చాల

చిన్నగా కట్టుకొనేవారు. సాధారణంగా వాటిని ఒక అంజూరపు చెట్టు చుట్టూ నిర్మించేవారు. ఈ చెట్టు యొక్క కొమ్మలు 25 లేక 40 అడుగుల మట్టుకు వ్యాపించేవి. సాధారణంగా ప్రజలు లేఖనములు చదువుకొనుటకు, ప్రార్థన చేయుటకు ఈ రకమైన అంజూరపు చెట్లక్రింద సమావేశమయ్యేవారు. బహుశ యేసు నతనయేలును చూచే సరికి అతడు ఆ చెట్టు క్రింద చేస్తున్నది యిదే కావచ్చును.

యేసుప్రభువు దేవుని కుమారుడనే మంచి ఒప్పుకోలును నతనయేలు అందరికంటె ముందుగా ఒప్పుకొన్నాడు. సీమోను పేతురు మత్తయి 16 : 16లో చేసిన ఒప్పుకోలు కంటె ఎంతో ముందు నతనయేలు యేసు ప్రభువును గూర్చిన సత్యాన్ని ఒప్పుకొన్నాడు. ప్రతివాడు యేసును గూర్చిన ఈ సత్యాన్ని ఒప్పుకోవాలి. "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును; రక్షణ కల్గునట్లు నోటితో ఒప్పుకొనును" అని పౌలు చెప్పాడు (రోమా 10 : 10).

నతనయేలను బర్తొలొమయి ఆర్మేనియా, పర్షియా, అరేబియా, ఐతియోపియా, ఇండియా దేశాలకు వెళ్లి సువార్త ప్రకటించాడని చరిత్రవలన తెలియుచున్నది. ఆర్మేనియాలో యున్న సంఘాన్ని బర్తొలొమయియే స్థాపించాడని వారు చెప్పుకొంటారు. చివరకతడు కొట్టబడి, తలక్రిందులుగా సిలువ వేయబడి చంపబడ్డాడు.

నిష్కపట హృదయంతో మనము లేఖనములను పరిశోధించినయెడల క్రీస్తును ఆయన సంఘాన్ని కనుగొనగలమని బర్తొలొమయి జీవితం మనకు తెలియజేయుచున్నది. క్రీస్తులోనికి ఆయన సంఘంలోనికి రావాలంటే యేసుప్రభువును నమ్మి, పాపముల విషయమై మారుమనస్సు బొంది, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. నీవు క్రీస్తులో యున్నావా ?

---

# 9. తోమా

## ( Thomas )

యేసు ప్రభువును వెంబడించిన 12 మందిలో అపొస్తలుడైన తోమాను గూర్చి ఈరోజు కొంత తెలిసికొందాము. తోమా అనునది హెబ్రీ పేరు. తోమాకు దిదుమ అనే గ్రీకు పేరు కూడ యున్నది. హెబ్రీ భాషలో తోమా అన్నా, గ్రీకు భాషలో దిదుమ అన్నా, కవలవాడు (Twin) అని యర్ధము. యితడు కవలవాడైతే యితని తోబుట్టువు ఎవరో మనకు తెలియదు. యూసిబియస్ అనే చరిత్రకారుడు యూదా అనునది అతని అసలు పేరని, తోమా లేక దిదుమ అనేది అతని మారు పేరని చెప్పుచున్నాడు. తోమా గలిలయ వాడు. అతడు వృత్తిరీత్యా జాలరిగాని, వడ్రంగి గాని కావచ్చును. మొదటి మూడు సువార్తలలో అతని పేరు మాత్రమే కన్పడతాది. అయితే యోహాను సువార్తలో అతని గూర్చి మరికొంత సమాచారం మనకు లభించుచున్నది.

నిజానికి తోమాను గూర్చి లేఖనాల్లో చెప్పబడింది తక్కువే. అతడు 12గురు అపొస్తలులలో ఒకనిగా లెక్కింపబడ్డాడు (మత్త 10 : 3; మార్కు 3 : 18; లూకా 6 : 15; అపొ. కా. 1 : 13). సందేహించు తోమా యనే బిరుదు అతనికేలాగూ ఉన్నది గాని అది లేఖనాల్లో ఆరంభించ బడలేదు. నిజానికి సందేహించే ఈ స్వభావములో మిగిలిన వారి నుండి అతడు వేరేగా యేమీ లేదు. మొదటిగా, సందేహ

మునుతో యున్నవాడు అతడొక్కడే కాదు. మృత్యేనే మరియు పునరుత్థానుడైన క్రీస్తును చూచినట్లు అపొస్తలులకు తెల్లియు జేయగా వారామె సాక్ష్యమును సందేహించారు (మార్కు 16 : 11). తరువాత తమవారిలో యిద్దరి సాక్ష్యాన్ని వారు నమ్మలేకపోయారు (మార్కు 16 : 13). "పిమ్మట ఆయన వారికి ప్రత్యక్షమై తాను లేచిన తరువాత తన్ను చూచిన వారి మాట నమ్మనందున వారి అపనమ్మిక నిమిత్తమును హృదయ కాఠిన్యము నిమిత్తమును వారిని గద్దించెను" (మార్కు 16 : 14). వారు నమ్మలేదు సరిగదా తమతో చెప్పిన స్త్రీల మాటలు వారికి వెర్రి మాటలుగా కనబడ్డాయి (లూకా 24 : 11). గనుక సందేహశీలుడైనవాడు తోమా ఒక్కడే కాదు.

సందేహశీలునిగా గాక యితర లక్షణాలనుబట్టి తోమా మిగిలిన వారి నుండి వేరుగా కనబడుచున్నాడు. అతడు అభ్యాస సిద్ధమైనవాడు (He was a practical man). మరియు సరళ ప్రవర్తన గల్లవాడు. యేసు తన శిష్యులకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నానని, ఆయన వెళ్లుచున్న స్థలానికి మార్గము వారికి తెలియున్నదని చెప్పాడు. అయితే వారిలో నెవడును దానిని గ్రహించి యుండక పోవచ్చును. సరిగదా వారందరు దిగ్భ్రమ జెందారు. అయితే తోమా, "ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే, ఆ మార్గము ఏలాగు మాకు తెలియును?" అని ఆయనను ప్రశ్నించాడు (యోహాను 14 : 5).

అంతేకాదు, తోమా సాహసవంతుడు. లాజరు చని పోయిన తరువాత యేసు యూదయ ప్రాంతమునకు మరల వెళ్ల నిశ్చయించుకొన్నాడు, గాని అది ఆయనకు అంత క్షేమ కరమైన స్థలము కాదు. "ఆయన శిష్యులు బోధకుడా, యిప్పుడే యూదులు నిన్ను రాళ్లతో కొట్ట చూచుచుండిరే; అక్కడికి తిరిగి వెళ్లుదువా అని ఆయన నడిగారు" (యోహా 11 : 7, 8). అందరు ఆయనతో కూడ యూదయకు వెళ్లుటకు సంశయించుచుంటే, "అందుకు దిదుమ అనబడిన తోమా, ఆయనతో కూడ చనిపోవుటకు మనమును వెళ్లుదమని తన తోడి శిష్యులతో చెప్పాడు" (యోహా 11 : 16). "తన ప్రాణము దక్కించుకొనువాడు దాని పోగొట్టు కొనును గాని నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టు కొనువాడు దాని దక్కించుకొనునని" యేసు ప్రభువు చెప్పిన మాటల యొక్క భావాన్ని తోమా బాగుగా గ్రహించాడు (మత్త 10 : 39).

తోమావలె ప్రభువుకొరకు మనం మరణించడానికి సిద్ధపడియున్నామా ? అట్లు చేయడానికి నిజానికి మనం సిద్ధ పడియుండాలి. "మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నీకు జీవ కిరీట మిచ్చెదనని" అందుకే ప్రభువు చెప్పాడు (ప్రకట 2 : 10).

తోమా అభ్యాస సిద్ధమైనవాడు, అంటే Practical Man అని మనం చెప్పుకొన్నాము. యేసు ప్రభువు పునరు త్థానుడైన సంగతిని గూర్చి అతడు సందేహించాడు. మిగిలిన

వారు కూడ సందేహించారు, గాని ఒకటి-వారందరు తిరిగి లేచిన తమ ప్రభువును చూచారు గాని అప్పుడు తోమా వారితో లేడు. "యేసు వచ్చినప్పుడు పండ్రెండు మందిలో ఒకడైన దిదుమ అనబడిన తోమా వారితో లేకపోయెను. గనుక తక్కిన శిష్యులు మేము ప్రభువును చూచితిమని అతనితో చెప్పగా అతడు - నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనేగాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20 : 24, 25). యేసు ప్రభువు లేచాడని తోమా విశ్వసింపగోరాడు, గాని దాన్ని ఖచ్చితం చేసుకొని విశ్వసింపగోరాడు. అందువలన తన ఆశను మొహమాటం లేకుండా వ్యక్తపర్చాడు. యిది చాల ప్రాముఖ్యమైన సంగతి. తోమా అందుకే ఋజువు కావాలని కోరాడు.

ఋజువు కావాలని కోరడం తప్పేమీకాదు. క్రైస్తవ్యము మూఢ నమ్మకములపైనను, ఆచారముల పైనను ఆధారపడిన మార్గము కాదు. అది విశ్వాస మార్గము (హెబ్రీ 11 : 1). అందుకే సమస్తమును పరీక్షించి, మేలైన దానిని చేపట్టుడియని పౌలు చెప్పుచున్నాడు (1 థెస్స 5:21). ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి యని యోహాను చెప్పుచున్నాడు (1 యోహా 4 : 1). తోమా తన

సంశయాన్ని వెళ్ల బుచ్చిన "ఎనిమిది దినములైన తరువాత ఆయన శిష్యులు మరల లోపల ఉన్నప్పుడు తోమా వారితో కూడ ఉండెను. తలుపులు మూయబడి యుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి-మీకు సమాధానము కలుగును గాక అనెను. తరువాత తోమాను చూచి నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. అందుకు తోమా ఆయనతో - "నా ప్రభువా నా దేవా అనెను" (యోహాను 20 : 26-28). పునరుత్థానుడైన ప్రభువును చూడగానే తోమాకు యిక సందేహమేమియు లేదు. ఆయనే ప్రభువని, దేవుడని నిర్మొహమాటంగా ఒప్పుకొన్నాడు, అప్పటినుండి గాఢంగా ప్రకటించాడు.

అపొస్తలుడైన తోమా పర్షియాలోను, బబులోను లోను సువార్త ప్రకటించాడు. అటు తరువాత అతడు భారత దేశానికి వచ్చాడని అతని ధర్మకార్యముల వలన భారత దేశంలో గొప్ప ప్రసిద్ధిగాంచాడని చెప్పబడుచున్నది. అతడు భారతదేశంలో విగ్రహారాధకుల వలన పొడిచి చంపాబడ్డాడని చారిత్రిక సాంప్రదాయము వలన తెలియుచున్నది. అపొ. తోమా చేసిన కృషికి జ్ఞాపకార్థముగా మద్రాసులో St. Thomos Mount ఉన్నది; మరియు St. Thomos Church కూడ యున్నది.

తోమా దేవునియొద్దకు పోయే మార్గము తెలిసికోగోరాడు. యేసు "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడని" చెప్పాడు (యోహా౯ 14:5, 6). నీవు క్రీస్తును తెలిసికొన్నావా? ఆయనను గూర్చి, ఆయన సంఘాన్ని గూర్చి సందేహాలు, సంశయాలు ఏమైన ఉంటే నీకు సమీపంగా యున్న క్రీస్తు సంఘాన్ని ఈరోజే దర్శించుము.

## 10. సుంకరియైన మత్తయి

### (Mathew, the Publican)

యేసుప్రభువు అపొస్తలులలో సుంకరియైన మత్తయి మనకు కనబడుచున్నాడు. ఇతడు అల్ఫయి కుమారుడు. యేసును వెంబడించిన మరియలలో ఇతని తల్లి కూడ యున్నది (మార్కు 2 : 14). మత్తయికి తన తలిదండ్రులు లేవీ యని కూడ పేరు పెట్టారు. మత్తయి సుంకపు గుత్త దారుడు అంటే రోమా ప్రభుత్వానికి ప్రజల నుండి పన్ను వసూలు చేసేవాడు.

పాలస్తీనాలోని కపెర్నహూములో ప్రభుత్వ సుంకరి యైన లేవీ తన కార్యాలయంలో పనిచేయుచుండెను. ఒక నాడు పన్ను కట్టినవారి యొక్కయు, కట్టనివారి యొక్కయు జాబితాను తయారుచేస్తూ అతడు తన స్వంత పరిస్థితిని గూర్చి ఆలోచించుకొనసాగాడు. అతడు రోమా ప్రభుత్వ సేవకుడు గనుక తన ప్రజలతని ద్వేషించేవారు. వారు దేశభక్తి గల వారు గనుక అతడు యూదుల వ్యతిరేకియని, సమాజద్రోహి యని తలంచేవారు. అందువలన వారతని సాంఘికంగా వెలి వేసారు. తన పూర్వ మిత్రులతనితో సంభాషించుట మాని వేసారు. తన మత గురువు లతని బహిష్కరించారు. వారి న్యాయస్థానములలో అతనికి చోటు లేకపోయింది. సుంకపు గుత్తదారులు సామాన్య నేరస్థులవలె దేశ ద్రోహులవలె యూదుల సమాజంలో తమ స్థానాన్ని కోల్పోయినవారు.

మత్తయిని, మిగిలిన సుంకపు గుత్తదారులును వారి వృత్తి వలన పాపులని పరిగణింపబడ్డారు. సుంకరులు, చోరులు, జారులు, మోసగాళ్లు వీరందరు వెలివేయబడిన వారే. వారిని తమ కులములోనికి మరల చేర్చుకొనే ప్రసక్తి లేదని పరిసయ్యులు ధర్మశాస్త్రోపదేశకులు వారికి విపులంగా తెలియజేసారు.

మత్తయి వీటన్నిటిని గూర్చి ఆలోచించుచు కపెర్నహూములో తన కార్యాలయంలో పనిచేయుచున్న సందర్భములో అతనికొక పిలుపొచ్చింది! యేసుప్రభువును గూర్చి అతడు కొన్ని వారాలుగా వింటున్నాడు గాని ఆయన ఇప్పుడతని ఆఫీసు ముందు నుండే వెళ్ళుచున్నాడు. అతన్ని చూచి "నన్ను వెంబడించుము" అని ఆయన అన్నాడు. అతడు సమస్తమును విడిచిపెట్టి లేచి ఆయనను వెంబడించాడు (లూకా 5 : 27, 28). అప్పటినుండి మత్తయి అని పిలువబడిన లేవీ ఈ లోకాన్నంతటిని తలక్రిందులు చేసిన దేవుని కుమారుని జీవితమునకు వ్యక్తిగత సాక్షి అయ్యాడు. యేసుప్రభువు యొక్క జీవితం అతన్ని సంపూర్తిగా మార్చివేసింది. ఈ లోకంలో ద్వేషింపబడిన వారికి యేసు ఇచ్చిన పిలుపుకు అతడొక గొప్ప మాదిరియై యున్నాడు.

ప్రజలు సాంఘికంగాను, రాజకీయంగా, జాతీయంగాను ఏయే వృత్తులలో యున్నను సరే, యేసుప్రభువు వారందరిని ఒకే సహవాసంలో యుండుటకు పిలువవచ్చాడు. నశించినదానిని

వెదకి రక్షించుటకు ఆయన ఈ లోకానికి వచ్చాడు (లూకా 19 : 10).

మత్తయి అపొస్తలులందరి కంటె ఎక్కువ విద్యావంతుడని, ప్రజ్ఞ గలవాడని మనం చెప్పుకోవాలి. అతని వృత్తిలో యున్న వారికి హెబ్రీ, గ్రీకు, అరామిక్, లాటిన్ భాషలు వచ్చి యుండాలి. మత్తయి వ్రాసిన సువార్త ఎక్కువ హెబ్రీయుల కొరకు లేక యూదుల కొరకు వ్రాయబడింది. అతడు తన సువార్తలో పాత నిబంధన సందర్భాలను 65 సార్లు ఎత్తి చూపించాడు. యేసు దావీదు కుమారుడనే సత్యాన్ని 8 సార్లు వ్రాసాడు.

యేసుప్రభువు లేవీ అనబడిన మత్తయిని పిలువగానే, అతడు సమస్తాన్ని విడిచి ఆయనను వెంబడించాడు. "ఆ లేవీ తన యింట ఆయనకు గొప్ప విందు చేసెను" అని లూకా 5 : 29 చెప్పుచున్నది. ఈ విందు చేయుటద్వారా మత్తయి యేసుప్రభువు యెడల తనకున్న ప్రేమను వెల్లడిపరచాడు. యేసుతో అతనికొక క్రొత్త సంబంధం యేర్పడింది. అది గొప్ప సంతోష సమయం. ఈ విందు చేయడం ద్వారా తనలో యున్న ఆనందాన్ని అతడు వెడలిపర్చాడు.

ఆదిమ క్రైస్తవులు యేసుప్రభువును కనుగొనగానే తమలో యున్న ఆనందాన్ని వెల్లబుచ్చేవారు. పెంతెకొస్తు నాడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మూడు వేల మంది

క్రైస్తవులు దేవుని స్తుతించుచు ప్రజలందరి వలన దయ పొందినవారై ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి (అపొ.కా. 2:46, 47). ఐతియోపియా నపుంసకుడు క్రీస్తు సువార్తను విని బాప్తిస్మము పొంది సంతోషించుచు తన త్రోవను వెళ్లెనని వ్రాయబడి యున్నది (అపొ.కా. 8 : 39). ఫిలిప్పీయి చెరసాల అధిపతి పౌలు సీలాల ద్వారా క్రీస్తు సువార్త విని, బాప్తిస్మము పొంది దేవుని యందు విశ్వాస ముంచినవాడై తన ఇంటి వారందరితో కూడ ఆనందించాడు (అపొ.కా. 16 : 34). "ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి"; "ఎల్లప్పుడు ప్రభువు నందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" యని పౌలు చెప్పాడు (1 థెస్స 5:16; ఫిలి 4:4). మత్తయి ఏర్పాటు చేసిన విందునుబట్టి తన పాతమిత్రులకు పాతజీవితానికి అతడు వీడ్కోలు పల్కాడు. యికమీదట యేసును వెంబడిస్తానని తన మిత్రులకు ఈ విధంగా తెలియజేసాడు. యేసుక్రీస్తును వెంబడించువారందరు తమ జీవితంలో కలిగిన మార్పునకు తగిన ఫలములు ఫలించాలి (మత్తయి 3 : 8). తాను కనుగొన్న క్రీస్తును తన మిత్రులకు బంధువులకు మత్తయి ఈ విందు ద్వారా పరిచయం చేసాడు.

యేసుప్రభువు పరమ వైద్యుడు. ఆయన ఆయా రోగములు గలవారిని బాగుచేస్తూ మత్తయిని అపొస్తలునిగా యుండుటకు పిలిచాడు; పాపపు రోగము నుండి విముక్తుని గావించాడు. యేసు మత్తయి ఏర్పాటు చేసిన విందులో

యున్నపుడు "సుంకరులును ఇతరులు అనేకులును వారితో కూడ భోజనమునకు కూర్చుండిరి. పరిసయ్యులును వారి శాస్త్రిలును ఇది చూచి సుంకరులతోను పాపులతోను మీరేల తిని త్రాగుచున్నారని ఆయన శిష్యులమీద సణిగిరి. అందుకు యేసు - రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కర లేదు. మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదని వారితో చెప్పెను" (లూకా 5 : 29-32).

నేటి మన పరిస్థితి ఆనాటి పరిసయ్యులకేమీ తీసిపోదు. ప్రతిరోజు అనేక మతశాఖలు క్రొత్తగా ఉద్భవిస్తూనే యున్నాయి. అవి పరిసయ్యుల సంకుచిత సూత్రాలపై ఆధార పడి స్థాపింపబడుచున్నాయి. మనం అన్ని కులస్థులవారికి, తెగలవారికి భాషలు మాట్లాడువారికి క్రీస్తు సువార్త నందియ్య డానికి ఎల్లప్పుడు ఆసక్తి కలిగియుండాలి.

మత్తయి పాలస్తీనలోను యితర ప్రాంతములలోను యున్న యూదులకు క్రీస్తు సువార్తను బోధిస్తూ 15 సంవత్స రాలు గడిపాడని చారిత్రిక సాంప్రదాయము వలన తెలియు చున్నది. అతడు ఐతియోపియాలోను, మాసిదోనియ, సిరియా, పర్షియా దేశములలోను కొంతకాలము గడిపాడు. చివరిగా అతడు ఖడ్గము వలన హతమార్చబడ్డాడు.

మత్తయి వలె శిష్యత్వపు పిలుపుకు సిద్ధముగా యుండాలి. గొప్ప వైద్యుడైన యేసుప్రభువు మన పాపపు గాయము లన్నిటిని బాగుచేస్తాడు. సమస్తమైన వారలారా, నా యొద్దకు రండని ఆయన పిలుచుచున్నాడు. మత్తయి వలె సమస్తాన్ని విడిచి ఆయనను వెంబడించవా ?

# అల్ఫాయి కుమారుడగు యాకోబు
## (James, the son of Alphaeus)

యేసును వెంబడించిన అపొస్తలులలో అందరి పేర్లు మనకు సునాయాసంగా జ్ఞాపకం ఉండవు. యాకోబు, యోహాను, పేతురు, అంద్రెయ మొదలగువారు అపొస్తలులలో ప్రఖ్యాతి గాంచినవారు. అయితే బర్తొలొమయి, అల్ఫాయి కుమారుడగు యాకోబు, తద్దయి అనబడిన యూదా అను వారిని గూర్చి మనం బహు స్వల్పమే ఎరుగుదుము. క్రీస్తు సువార్తను ఆనాటి లోకానికి అంతటికి ప్రకటించుటలో అపొస్తలులందరు తమ కప్పగింపబడిన బాధ్యతను గొప్పగా నిర్వహించినను, వారందరి కార్యములు లేఖనాల్లో వివరంగా వ్రాయబడలేదు. అట్టివారిలో అపొస్తలుడైన అల్ఫాయి కుమారుడగు యాకోబు ఒకడు.

క్రొత్త నిబంధనలో యాకోబు పేరు గలిగినవారు కనీసం నలుగురు మనకు కనబడతారు. మొదటిగా, జెబెదయి కుమారుడైన యాకోబు ఒక అపొస్తలుడు. యేసుప్రభువు యొక్క సహోదరుడైన యాకోబు రెండవవాడు. "ప్రభువు యొక్క సహోదరుడైన యాకోబు" అని పౌలు అతని గూర్చి గలతీ 1 : 19లో చెప్పుచున్నాడు. యాకోబు పత్రికను వ్రాసినవాడు యితడే (యాకోబు 1 : 1). తరువాత లూకా 6 : 16లో మనకు యూదా సహోదరుడైన యాకోబు కనబడుచున్నాడు. చివరిగా అల్ఫాయి కుమారుడైన యాకోబు, లేక

చిన్న యాకోబు మనకు కనబడుచున్నాడు. ఇతడు కూడ అపొస్తలుడే.

ఈ యాకోబు తండ్రి పేరు అల్ఫయి. ఇది ఒక గ్రీకు పేరు. లూకా సువార్త 24వ అధ్యాయములో ఎమ్మాయు అను గ్రామమునకు వెళ్లుచున్న యిద్దరికి పునరుత్థానుడైన ప్రభువు కనబడి వారితో కూడ ప్రయాణము చేసాడు. వారిద్దరిలో ఒకడు క్లెయొపా అని మనకు చెప్పబడింది. అల్ఫయి కుమారుడగు యాకోబే ఆ క్లెయొపా యని అనేకులు తలస్తారు (లూకా 24:13-31). క్లెయొపా యనునది అరామిక్ నామము.

యాకోబు తల్లి యేసును వెంబడించిన మరియలలో ఒకామె. యేసు గలిలయలో యుండగా ఈ స్త్రీలు ఆయనకు పరిచర్య చేసారు. యేసు సిలువమీద మరణించుచుండగా "కొందరు స్త్రీలు దూరమునుండి చూచుచుండిరి. వారిలో మగ్దలేనే మరియయు చిన్న యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయు, సలోమేయు ఉండిరి. ఆయన గలిలయలో ఉన్నప్పుడు వీరాయనను వెంబడించి ఆయనకు పరిచారము చేసినవారు" అని మార్కు 15:39-41లో వ్రాయబడియుండుట మనం చూడగలము. యేసుప్రభువు పునరుత్థానుడైన దినము మగ్దలేనే మరియయు, యాకోబు తల్లియైన మరియయు సలోమేయు ఆయన సమాధి దగ్గరకు వచ్చి ఆయన తిరిగి లేచిన వార్తను ముందు తెలిసికొన్నవారు (మార్కు 16 : 1-7).

మత్తయి తండ్రి పేరు కూడ అల్ఫయే యని మార్కు 2 : 14ను బట్టి మనము గ్రహించగలము, యాకోబు, మత్తయిల తండ్రి పేరు ఒక్కటే గనుక వీరిద్దరు సహోదరులు కావచ్చునని కొందరు భావిస్తారు. అయితే వీరిద్దరి పేర్లు ఎక్కడా జంటగా కనబడవు. అపొస్తలుల కార్యములలో మొదటి అధ్యాయాల్లో అపొస్తలులందరిని గూర్చి చెప్పినప్పుడు తప్ప ఈ యాకోబు క్లుప్తముగా కనబడి అటు తరువాత మరుగై పోయాడు.

అతడు ఇంగ్లాండు, ఐర్లాండు, స్పెయిన్, పర్షియా దేశాలలో సువార్త చాటించాడని పూర్వీకుల సాంప్రదాయాన్ని బట్టి తెలియుచున్నది. అతడు రంపముతో కోయబడ్డాడని కొందరు, సిలువ వేయబడి చంపబడ్డాడని మరికొందరు చెబుతారు.

అల్ఫయి కుమారుడైన యాకోబులాంటి వ్యక్తిని గూర్చి మనకు అనేక ప్రశ్నలు స్వాభావికంగా రావచ్చు. యితడు ఘనుడేగాని, దీనుడైన ఇతడేలాంటివాడు ? వాని ధైర్యసాహసాలు ఎట్టివి ? మన బలహీనతలలో ఏమేమి అతడు కలిగియుండెను ? అతడు జయించిన పోరాటములేమిటి? రారాజు పాదముల యొద్ద అతడు సమర్పించే విజయ చిహ్నాలేమిటి ?

అయితే మనకు జవాబులు దొరకని ఈ ప్రశ్నలనుబట్టి మేఘమువలె మన చుట్టూ ఆవరించియున్న గొప్ప సాక్షి

సమూహములో యాకోబు ఒకడని గ్రహించుకోగలము. ఈ సాక్షి సమూహాన్ని దేవుడు మాత్రమే ఎరుగును. తన వలల దగ్గర నుండి పేతురును పిలిచిన స్వరమే ఈ యాకోబును కూడ పిలిచింది. "పరిశుద్ధాత్మ పొందుడి" యని చెప్పి యేసు అపొస్తలులపై ఊదిన వారిలో ఈ చిన్న యాకోబున్నాడు (యోహాను 20 : 23). పునరుత్థానుడైన ప్రభువు వారితో కూడ తిని త్రాగినప్పుడు ఇతడున్నాడు.

ఏ విధమైన ఆడంబరము లేక ప్రభువు పని చేసికొని పోయే పరిశుద్ధులలో ఈ యాకోబు ఉండుట సంతోషకరమైన సంగతి. నతనయేలు, చిన్న యాకోబు, తద్దయి అను వారు మనకు అంత ఘనంగా కనబడకపోవచ్చును గాని వారికప్పగించిన పనిని నమ్మకము చేయు శక్తి సామర్థ్యాలను ప్రభువు వారిలో కనుగొన్నాడు. గనుకనే 'నన్ను వెంబడించుడి' యని వారిని పిలిచాడు. వారు బేషరతుగా ఆయనను వెంబడించారు గనుక, "మనుష్య కుమారుడు తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి తీర్పు తీర్చెదరని" ప్రభువు వారితో చెప్పాడు (మత్తయి 19 : 28). ఆ పండ్రెండుగురిలో అల్ఫయి కుమారుడైన యాకోబు ఒకడని మనము గుర్తించుకొందము.

మరల, పరలోక పట్టణాన్ని భక్తుడైన యోహాను మనకు వర్ణిస్తూ, "ఆ పట్టణపు ప్రాకారము పండ్రెండు పునాదులు కలది, ఆ పునాదులపైన గొర్రెపిల్ల యొక్క పన్నిద్దరు అపొస్తలుల పండ్రెండు పేర్లు కనబడుచున్నవని చెప్పాడు" (ప్రక 21 : 14). అపొస్తలుల యొక్క దృఢ విశ్వాసము, సంపూర్ణ సమర్పణ జీవితం వలన, "నా తండ్రిచేత ఆశీర్వదించబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" యని ప్రభువు చెప్పాను (మత్త 25 : 34). మన విశ్వాసానికి పునాది వేసిన వారిలో యాకోబు ఒకడు (ఎఫెసీ 2 : 20).

నీ విశ్వాసము ఎవరిపై ఆధారపడియున్నది ? అది అపొస్తలులు నాటిన విశ్వాసమా ? కాని యెడల ఈ రోజే యేసు ప్రభువును విశ్వసించి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. క్రీస్తుపై నీ విశ్వాసాన్ని ఆధారము చేసుకొనుము.

## 12. తద్దయి
## ( Thaddeus )

యేసును వెంబడించిన పండ్రెండుగురి అపొస్తలులలో ఇంకో యూదా కూడ ఉన్నాడు. ఇతడు తద్దయి యను మారుపేరు గల లెబ్బయి అని మత్తయి 10 : 3లో చెప్పబడినది; మార్కు 3 : 18లో ఇతడు తద్దయి అని మాత్రమే పిలువబడ్డాడు. ఇతడు యాకోబు సహోదరుడైన యూదా అని లూకా 6 : 16లో చెప్పబడింది.

యూదా అను పేరుకు "యెహోవా నడిపించును", "యెహోవా ఒప్పుకొనదగినవాడు" అని యర్థము. లెబ్బయి అనగా ధైర్యవంతుడు, సాహసవంతుడు అని యర్థము. తద్దయి అనగా ఉత్సాహపూరితుడు, జీవము గలవాడు (lively & Vivacious) అని యర్థము. బహుశ ఈ మారుపేరులను యేసుప్రభువు ఇచ్చి యుండవచ్చును. ఆయన కనీసం ఇంకో ముగ్గురు అపొస్తలులకు మారుపేర్లు పెట్టాడు. యాకోబు యోహానులను ఆయన ఉరిమెడివారని పిలిచాడు, లేక బోయనెర్గసు అని పేరు పెట్టాడు. సీమోను పేతురుకు ఆయన కేఫా అని పేరు పెట్టాడు (మార్కు 3 : 17; యోహాను 1 : 42). యోహాను 14:22లో ఇతడు 'ఇస్కరియోతు కాని యూదా' అని చెప్పబడ్డాడు. ఇతడు యాకోబు సహోదరుడైన యూదా అని లూకా 6:16లో పిలువబడుట యిదివరకే గమనించాము.

ఈ యూదాను గూర్చి ఇంతకు మించి లేఖనాల్లో ఖచ్చితమైన సమాచారం మనకు లేదు.

అయినను తద్దయి అను మారుపేరుగల లెబ్బయి మన కొరకు ప్రశస్తమైన సంగతి విడిచి వెళ్లాడు. అది అతడు మన ప్రభువునడిగిన ఒక చిన్న ప్రశ్న మాత్రమే. ఒక మేడగదిలో యేసుప్రభువు ఆయన అపొస్తలులు పస్కా విందును భుజించుచున్న సమయమది. నేను మిమ్మును వదిలి త్వరలో వెళ్లి పోవుదును, మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్లుచున్న స్థలమునకు మీకు మార్గము తెలియును అని ఆయన వారికి చెప్పాడు. "అందుకు తోమా-ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే; ఆ మార్గ మేలాగు తెలియునని ఆయన నడుగగా, యేసు - నేనే మార్గమును, సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పాడు. (యోహాను 14 :5, 6). అపొ. ఫిలిప్పు ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మా కంతే చాలునని అన్నాడు. అందుకు యేసు నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడని చెప్పాడు (యోహా 14 : 8-10).

ఇట్టి సందర్భములో, కొంతమట్టుకు గజిబిజియైన "ఇస్కరియోతు కాని యూదా - ప్రభువా, నీవు లోకమునకు కాక మాకు మాత్రమే నిన్ను నీవు కనబరచుకొనుట కేమి సంభవించెనని" ఆయన నడిగాడు. "యేసు - ఒకడు నన్ను

ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును, మేము వానియొద్దకు వచ్చి వానియొద్ద నివాసము చేతుము" అని చెప్పాడు (యోహా 14 : 22, 23). ఆయనను ప్రేమించి, ఆయన ఆజ్ఞలను గైకొను వారిలో ఆత్మీయముగా తండ్రి కుమారులు నివాసము చేతురని యేసుప్రభువు చెప్పాడు. ఇది ఎంత ఆశ్చర్యం! నిత్యత్వమే దిగివచ్చి మానవులలో వసించడం ఆశ్చర్యం!! ఈ లోకం దాన్ని చూడలేదు, గ్రహించుకోలేదు, ఎరుగదు. అయితే దేవుని కుమారుడైన ఈ క్రీస్తు మృత్యుంజయుడై జీవించుచు తన వారి యొద్దకు వచ్చి ఆయనలోని జీవాన్ని పంచుచున్నాడు. అది కేవలం భౌతిక జీవం కాదు గాని అది యథార్థ జీవం, నిత్యునిలోనుండి ప్రవహించే జీవం, నిత్యజీవం! నా యందు విశ్వాసముంచు వారు నిత్యజీవం గల వారని అందుకే ఆయన చెప్పాడు (యోహాను 6 : 54; 1 యోహాను 5 : 13).

యూదా అనబడే తద్దయి చనిపోయి కొన్ని శతాబ్దాలు గడిచాయి. అయినను అతడు ఈ లోకాన్ని విడువక ముందు క్రీస్తు అతని యొద్దకు, అతనిలోనికి రావడాన్ని అనుభవించాడు. ఆకాశములు తెరువబడి క్రీస్తు విజయోత్సవముతో తిరిగివచ్చే దినాన్ని చూచేవరకు అతడు జీవించలేదు; బహుశ మనము కూడ జీవించమేమో! ఆయన రాకడ ఎప్పుడో ఎవరికీ తెలియదు. గాని ఆ గొప్పదినాన్ని గూర్చిన నిరీక్షణ కలిగి అతడు

చనిపోయాడు. పరలోక సంబంధమైన వరమును రుచి చూచి, పరిశుద్ధాత్మలో పాలివాడై, దేవుని దివ్య వాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన వారిలో అతడొకడు. యేసు తన ప్రజలను అనాథులుగా విడువలేదు. విశ్వాసము ద్వారా మన హృదయాల్లో ఆయన నివసించుచునేయున్నాడు. ఈ గొప్ప అనుభూతిని అపొస్తలులలో ప్రతి ఒక్కడు ప్రత్యక్షంగా పొందాడు. అందువలననే, "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభమని" వారు చెప్పగలిగారు (ఫిలిప్పీ 1 : 21).

తద్దయి అనబడిన యూదా సిరియా దేశములోను పర్షియా దేశములోను క్రీస్తు సువార్త ప్రకటించాడని చరిత్ర చెప్పుచున్నది. అతడు ఆరా రాతులో బాణముతో కొట్టబడి చంపబడ్డాడని చారిత్రిక సాంప్రదాయమువలన మనకు తెలియుచున్నది.

ఈ అపొస్తలుని నుండి మనం యేమి నేర్చుకోగలము? మనల్ని గూర్చి బోలెడంత మంది ఎరుగకపోయినను, దేవుడు మనల్ని తన పనికొరకు వినియోగించు కొంటాడు. మనకు బోలెడన్ని తలాంతులుండ నవుసరంలేదు. మన దగ్గర యేమి ఉన్నదో దానిని ప్రభువుకు అర్పిస్తే ఆయన దానిని తన మహిమకొరకు కొన్ని వేలరెట్లు హెచ్చించి వాడు కొంటాడు. ఈలోకం అంతా సువార్త ప్రకటింపబడాలంటే, సంఘములో యున్న ప్రతివారు క్రీస్తు కొరకు వినియోగింపబడాలి. మొదటి

శతాబ్దములో క్రైస్తవులు బహుగా హింసింపబడ్డారు. అయితే హింసలవలన "చెదరి పోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" యని వ్రాయబడియున్నది (అపొ. కా. 8 : 4). అపొస్తలులను గూర్చి ఈ లేఖనము చెప్పబడలేదు గాని సామాన్య క్రైస్తవులను గూర్చి చెప్ప బడింది. సామాన్య క్రైస్తవులు ఆనాటి లోకాని కంతటికి సువార్త వాక్యమును ప్రకటించ గలిగారు. నీవు సూక్ష్మంగా క్రైస్తవుడ వయితే అపొ. తద్దయుని ప్రభువు వినియోగించి నట్లే నిన్ను కూడ వినియోగించగలడు. దేవునికి గొప్ప సేవ చేయుచున్న వారిలో అనేకులు నేడు కూడ ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వారు కాదు. అయితే వారెవరో, యేమి చేయు చున్నారో ప్రభువు ఎరుగును. గాని నీవు ప్రభువును ఎరుగుదువా ?

యేసు ప్రభువు నందు విశ్వాస ముంచుము, నీ పాప ముల విషయమై మారుమనస్సు పొందుము. యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందుము. ఈరోజే ప్రభువు పక్షమున చేరుము.

# 13. జెలోతే అనబడిన సీమోను
## (Simon the Zealot)

యేసుప్రభువు యొక్క అపొస్తలులలో జెలోతే అనబడిన సీమోను మనకు కన్పించుచున్నాడు. అతని గూర్చి కేవలం నాలుగు మారులు మాత్రమే క్రొత్త నిబంధనలో చెప్పబడింది. మత్తయి 10 : 4లోను, మార్కు 3 : 18లోను అతడు కనానీయుడైన సీమోను అని చెప్పబడ్డాడు. దీనిని బట్టి అతడు కానాను నుండి వచ్చిన వాడని కొందరు భావిస్తారు. మరికొందరు అతడు కానా యను ఊరి నుండి వచ్చిన వాడని తలస్తారు. లూకా 6 : 15లోను, అపొ.కా. 1:13లోను అతడు జెలోతే అనబడిన సీమోను అని చెప్పబడ్డాడు. అపొస్తలుల జాబితాలలో తప్ప అతని గూర్చి మరెక్కడ చెప్పబడలేదు. అయితే జెలోతే అనబడిన సీమోనును గూర్చి మనం ఏమి తెలుసుకోగలము ?

మొదటిగా అపొ. సీమోను ఒక జులోతే. జెలోతే అంటే ప్రగాఢమైన దేశాభిమాని, మతాభిమాని యని అర్ధము. జెలోతేలు ఆనాటి కాలపు ఒక రాజకీయ పార్టీ యని మనం చెప్పుకొవచ్చును. ఆ పార్టీని గలిలయుడైన యూదా అనువాడు స్థాపించినట్లు అపొ.కా. 5 : 37ను బట్టి తెలుసుకో గలము. యూదుల నాయకులు పేతురు యోహానులను పట్టుకొని వారిని చంప నుద్దేశించుచుండగా గమలీయేలను ధర్మశాస్త్రోప దేశకుడు లేచి వారితో ఇట్లనెను : "ఇశ్రాయేలీయులారా,

ఈ మనుష్యుల విషయమై మీరేమి చేయబోవుచున్నారో జాగ్రత్త సుమండి. ఈ దినములకు మునుపు . గలిలయుడైన యూదా అను ఒకడు వచ్చి ప్రజలను తనతో కూడ తిరుగుబాటు చేయ ప్రేరేపించెను; వాడు కూడ నశించెను, వానికి లోబడిన వారందరు చెదరి పోయిరి. కాబట్టి నేను మీతో చెప్పున దేమనగా ఈ మనుష్యుల జోలికి పోక వారిని విడిచి పెట్టుడి. ఈ ఆలోచనయైనను, ఈ కార్యమైనను మనుష్యుల వలన కలిగిన దాయెనా అది వ్యర్థమగును, దేవుని వలన కలిగిన దాయెనా, మీరు వారిని వ్యర్థపరచలేరు; మీ రొక వేళ దేవునితో పోరాడు వారవుదురు సుమీ" (అపో.కా. 5:33-39).

మొదటి శతాబ్దములో జీవించిన ప్రఖ్యాతి గాంచిన యూదా చరిత్ర కారుడగు జోసిఫస్‌ను బట్టి, ఈ జెలోతేలన బడిన వారందరు చెడ్డవారని మనకు తెలియుచున్నది. అతని కాలంలో వాళ్లందరు దుర్మార్గులు, దొంగలు, దోచుకొను వారు, హంతకులు. యెరూషలేము రోమీయుల కైవసమైన ప్పుడు జెలోతేల చేతిలో పడేకన్నా, రోమీయుల చేతిలో పడితేనే మేలని యూదులు తలంచేవారు.

జెలోతే అనబడిన సీమోనును పిలుచుటలో అన్ని రకములైన ప్రజలను నడిపించి, మార్చగల యేసు ప్రభువు యొక్క శక్తిని మనము కనుగొనగలము. జెలోతే యనబడిన ఈ దేశాభిమాని తన జనాంగాన్ని మొదట్లో గాఢంగా ప్రేమించగలిగితే, అతడు క్రైస్తవుడైనప్పుడు తన వారినే

కాదు, లోకంలో యున్నవారి నందరినీ ప్రేమించ గలడు! ఈ యావత్ప్రపంచము దేవునిదే యని అతడెరుగును, సంకుచిత మతాభిమానియైన ఈ బోధకుడు క్రీస్తును కనుగొనగానే, ఈ లోకమంతా తన పరిచార క్షేత్రమైనట్లు కనుగొంటాడు. సీమోనును పిలుచుటలో యేసుప్రభువు పిరికి వారిని, ధైర్య సాహసాలు లేని వారిని లక్ష్య పెట్టలేదని తెలుసుకోగలం. ఆయన అపొస్తలులలో అనేకులు ప్రగాఢమైన భావోద్రేకాలు కలిగిన వారు: యాకోబు యోహానులు ఉరిమెడి వారు, పౌలు హింసించేవాడు, పేతురు కలహించేవాడు, ఒట్లు పెట్టుకొనే వాడు. ఆయన సుంకరియైన మత్తయిని పిలిచాడు. రోమా ప్రభుత్వానికి సుంకము వసూలు చేసే మత్తయితో సహవసించడం జెలోతే అనబడిన సీమోనుకు క్లిష్టముగానే యుండును. అయినను వివిధ భావోద్రేకములు కలిగిన ఈ 12 మందిని ప్రభువు పిలిచి వారిని ఏకమనస్సు ఏకాభిప్రాయము ఏకతాత్పర్యము గలవారిగా తయారు చేయడంలో మానవుల మధ్యనే ఆయన చేసిన ఒక గొప్ప అద్భుతం యిది!

జెలోతే అనబడిన సీమోనులో యున్న గొప్ప ఆసక్తిని ధైర్యసాహసాలను మన ప్రభువు వినియోగించాడు. ఆయన పిలిచిన 12 మందిలోను తన చిత్తాన్ని జరిగించడంలో అవసరమైన లక్షణాలను ఆయన చూచాడు. నతనయేలులో ఆయన నిష్కాపట్యాన్ని చూచాడు; సీమోనులో గొప్ప ఆసక్తిని ధైర్యాన్ని చూచాడు, మానవుల పరివర్తనలో యున్న బలమైన లక్షణాలను నిర్మాణాత్మకమైన పంథాలో నడిపించే

శక్తి యేసు ప్రభువులో యున్నది. ఆయనకు ధైర్యం, సాహసం, నిర్భయం కావాలి. యివి నాశనం చేయడానికి గాక నిర్మాణాత్మక ప్రయోజనాలకు ఆయనకు కావాలి. క్రీస్తులో జెలోతేలు మనుష్యులతోగాక అపవాదితోను అతని పరివారముతోను పోరాడుతారు. సీమోనులో అపాయాన్ని ఎదుర్కొనడం అంటే యేమిటో యెరిగిన శిష్యుడాయన కున్నాడు. అతడు అన్నిటికి సాహసిస్తాడు, అన్నిటిని త్యజిస్తాడు, ఆత్మ పరిత్యాగము (self sacrifice) యొక్క అర్థాన్ని అతడు గ్రహిస్తాడు, అభావ రూపక జీవితాన్ని జీవిస్తాడు.

సీమోనులో యున్న మతసంబంధమైన ఆసక్తికి యేసు ప్రభువు నిర్మాణాత్మకమైన జ్ఞానాన్ని ప్రసాదించాడు. అనేకులు ఆసక్తిగలవారు గాని, జ్ఞానం కలిగిన వారు కారు. ఇశ్రాయేలీయులను గూర్చి పౌలు ఇట్లు చెప్పాడు: "వారు దేవుని యందు ఆసక్తిగలవారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను; అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనదికాదు" (రోమా 10 : 2). మనము ఆసక్తి గలవారమైతే జ్ఞానాన్ని దానికి జోడించాలి. "ఆసక్తి విషయములో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి" యని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (రోమా 12 : 11).

యేసు ప్రభువుతో సహవసించి జెలోతే అనబడిన సీమోను ఈలోక రాజ్యములు, దేశాధికారములకంటే దేవుని రాజ్యము యొక్క విలువ ఎంతో గొప్పదని తెలిసికొన్నాడు.

మీరు మొదట దేవుని రాజ్యమును నీతిని వెదకుడి యని ప్రభువు వారికి బోధించాడు (మత్త 6 : 33). నీతిమంతులు తండ్రియైన దేవుని రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురని కూడ ఆయన వారికి బోధించాడు (మత్త 13 : 43). యేసు ప్రభువులో ఈలోకాన్నంతటిని మార్చే శక్తిని సీమోను కనుగొన్నాడు. అతని శత్రువులు రోమీయులు కాదు గాని, అపవాదియు అతని దూతలునని అతడు గ్రహించగలిగాడు. దౌర్జన్యమువలన గాక, ప్రేమవలన ఈ లోకంలో మార్పు తీసికొని రాగలమని యేసుక్రీస్తు నుండి అతడు నేర్చుకొన్నాడు మత్త 5 : 43-45).

జెలోతే అనబడిన సీమోను ఆఫ్రికాలోను, ఆర్మేనియాలోను, మెసపొతేమియా, స్పెయిన్, బ్రిటన్ దేశాలలో సువార్త ప్రకటించాడని చరిత్ర చెప్పుచున్నది; అతడు పర్షియా దేశంలో రంపములతో కోయబడి హతసాక్షిగా మరణించాడు.

"మనుష్యు లందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని ఆయన యిచ్ఛయించుచున్నాడని" జెలోతే అనబడిన సీమోను ఉదంతమును బట్టి మనము తెలిసికోగలము. నీవు రక్షణ పొందావా ? లేని యెడల యేసుప్రభువును వెంబడించు, ఆయనకు హృదయపూర్వకముగా లోబడు, నీవెట్టి వాడవైనను సరే నిన్ను రక్షించి ప్రయోజనకారుడుగ ఆయన చేయగలడు !!

# 14. ఇస్కరియోతు యూదా - 1
## (Judas Iscariot)

యేసును వెంబడించిన పండ్రెండు మంది అపొస్తలు లలో ఇస్కరియోతు యూదా చివరిగా మనకు కన్పించు చున్నాడు. మత్తయి మార్కు సువార్తలలో ఇతని పేరు "ఆయనకు అప్పగించిన ఇస్కరియోతు యూదా" అని వ్రాయ బడి యున్నది (మత్త 10 : 4; మార్కు 3 : 19). లూకా 6 : 16లో ఇతడు 'ద్రోహి యగు ఇస్కరియోతు యూదా' అని పిలువబడ్డాడు.

బైబిలు చరిత్ర అంతటిలోను అసహ్యకరమైన, విషాద కరమైన వ్యక్తివలె ఇస్కరియోతు యూదా మనకగుపడు చున్నాడు. అతని గూర్చి అనేక మర్మాలు చుట్టుముట్టుకొని యున్నవని మనము గ్రహించాలి. అతని పేరులోని భావం, అతని పూర్వోత్తరం, అతని శీలం క్రీస్తును అప్పగించుటలో అతని ఉద్దేశ్యం, అతని మరణము యొక్క ఖచ్చిత వివరాలు, ఇవన్నీ గొప్ప మర్మాలే.

ఇస్కరియోతు (Iscariotas) అను పదము యొక్క అర్థము రాజద్రోహి, నరహంతకుడు కావచ్చును (అపొ.కా. 21 : 38). అట్లయితే యూదా ఇంతకు మునుపు యూదుల జాతీయవాది అయ్యుండవచ్చును. లేదా యూదయలోని తన నివాస స్థలమగు కెరీయోతు అను ఊరును బట్టి ఇస్కరి

యోతు అనునది బహుశ అతని యింటిపేరు కావచ్చును (యెహోషువ 15 : 25; యోహాను 6 : 71). యూదయలో హెబ్రోనుకు దక్షిణంగా కెరీయోతు అను పట్టణం ఉండేది. యూదా ఇస్కరియోతు సీమోను ఇస్కరియోతు కుమారుడు (యోహా 6:71). వీరు కేరీయోతు వాస్తవ్యులైతే పండ్రెండు మంది అపొస్తలులలో గలిలయుడు కానివాడు యూదా ఒక్కడు మాత్రమే. శిష్యునిగా యుండుటకు యూదా ఎప్పుడు ఎక్కడ పిలువబడ్డాడో మనకు తెలియదు. అయితే యేసుప్రభువు యూదయ గుండా ప్రయాణము చేసినప్పుడు అతని పిలిచి యుండవచ్చును.

ఇస్కరియోతు యూదా యేసుప్రభువు యొక్క ప్రాముఖ్య శిష్యులలో ఒకడగుట వలన అతని ఏకైకత విశిష్ట మగుచున్నది. డబ్బు సంచి ఎల్లప్పుడు అతని దగ్గరే యుండేది (యోహా 12 : 6). ఆఖరి భోజనం సందర్భంగా అతడు యేసు ప్రక్కనే ఘనతగల స్థానంలో కూర్చొని యున్నాడు (యోహాను 13:21-27). అయినను అతడు పేతురు యాకోబు యోహానుల వలె క్రీస్తుకు సన్నిహిత శిష్యుడు కాదు. సరిగదా యేసుప్రభువుయొక్క పని విషయంలో ఏమాత్రము ఏకాగ్రత కలిగినవాడు కాదని అగుపడుచున్నది (లూకా 22 : 3). డబ్బుసంచి తనయొద్ద ఉంచుకొనుటలో నైతిక బాధ్యతను అతడు అంగీకరించినను దానినుండి పదే పదే దొంగిలించే వాడు. అతడెన్ని సాకులు చెప్పినను బీదలను గూర్చి తన

ప్రభువుకున్న ఆసక్తి అతనికి లేదు. ఆయన బేతనియలో ఒక విందులో యుండగా మరియ, మిక్కిలి విలువగల అచ్చజటా మాంసి అత్తరును ఒక సేరున్నర యెత్తు తీసికొని యేసుపాదములకు పూసి తన తలవెండ్రుకలతో ఆయన పాదములు తుడిచింది. అప్పుడు ఇస్కరియోతు యూదా, ఈ అత్తరెందుకు మూడువందల దీనారములకు అమ్మి బీదల కియ్యలేదన్నాడు. "వాడీలాగు చెప్పినది బీదల మీద శ్రద్ధ కలిగి కాదుగాని వాడు దొంగయై యుండి, తన దగ్గర డబ్బుసంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలుంచుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను" అని యోహాను వ్రాసాడు (యోహాను 12 : 1-6). అతడు యేసు ప్రభువును అప్పగింపబోవునను సంగతిని శిష్యులలో ఎవరును ఎరిగి యుండలేదు.

అసలు ఇస్కరియోతు యూదాను తన శిష్యులలో ఒకనిగా యేసుప్రభువు ఎందు నిమిత్తం ఎంచుకొన్నాడు ? పాతనిబంధన ప్రవచనములు నెరవేరుటకుగాను ఆయన అతని ఎంచుకొన్నాడని కొందరు చెబుతారు. "నేను నమ్మికొనిన నా విహితుడు, నా యింట భోజనము చేసినవాడు నన్ను తన్నుటకై తన మడిమనెత్తెను" అని కీర్తన 41 : 9లో అతని గూర్చి ప్రవచింపబడింది. అతడు యేసు ప్రభువును ముప్పది వెండినాణెముల కొరకు అప్పగించునని జెకర్యా 11 : 12,13లో ప్రవచింపబడింది. ఒకొక్కసారి మానవుడు దేవుని త్రట్టు తిరిగినట్లు కన్పించినను, నిజంగా మారుమనస్సు కొత్త జన్మ

పొందియుండక పోవచ్చునని ఇస్కరియోతు యూదా జీవితం మనకు తెలియజేయుచున్నది. ధనాశ సమస్త కీడులకు మూలమని తెలియ జేయడానికి యేసుప్రభువు అతని పిలిచాడని మరికొంత మంది భావిస్తారు (1 తిమో 6:10). బహుశ దేవుని యొక్క సహనము, దీర్ఘ శాంతములను మనకు తెలియ జేయుడానికి ప్రభువు అతన్ని ఎంచుకొని యుండవచ్చును (2 పేతురు 3:15).

ఇస్కరియోతు యూదా అపొస్తలునిగా యుండుటకు ఎందుకు ఎంచుకొన్నాడు ? అనే ప్రశ్న మనకు రావచ్చును. అతడు యూదుల జాతీయవాది అయ్యుండవచ్చునని యిదివరకే మనము చెప్పుకొన్నాము. ఈ విషయంలో తన కలలు నెరవేరగలవనే ఆశతో అతడు యేసుప్రభువును చేరుకొని యుండవచ్చును. అతడు ప్రగాఢమైన జాతీయవాది. బహుశ యేసు ప్రభువు ఒకానొక దినమందు తన భూసామ్రాజ్యము నేర్పరచునని, రోమా సామ్రాజ్యపు కాడిని యూదులపై నుండి ఆయన తొలగించునని అతడు ఆశించి యుండవచ్చును. అయితే ఆయన దావీదు సామ్రాజ్యమును మరల భూమిపై స్థాపించుట అట్లుంచి (మార్కు 11:8-10), ఆయా సంఘటనలు యేసుప్రభువు హింసింపబడుటకును చంపబడుటకును ఉపక్రమించాయి. అతడు ఘోరముగా నిరుత్సాహవంతుడై రాజద్రోహి, లేక గురుద్రోహి అయ్యాడు అని కొందరు భావిస్తారు (మార్కు 12:1-11). యేసు చంపబడితే ఆయన శిష్యు

లందరు చివరకు చంపబడుదురని అతనెరుగును (మార్కు 13 : 4-13). గనుక ఈ విప్లవ మంతయు విషాదాంతము గాక ముందు యూదా, "ప్రభుత్వపు సాక్షిగా" మారి అధికారుల తరపున యుండగోరాడు (మార్కు 14 : 10, 11). అయినను అతడు ఆత్మహత్య చేసికొని చచ్చుట కూడ ఒక మర్మమే. ఏది ఎలాగయినను యూదా తన హృదయాన్ని అపవాదికి అంకితం చేసాడు. అపవాదికి బానిసలైనవారికి మరణమే అంత మని అతడు తెలియజేయుచున్నాడు. "ఇస్కరియోతు అన బడిన యూదాలో సాతాను ప్రవేశించెనని" లూకా 22 : 3 చెప్పుచున్నది. యోహాను 13 : 27 కూడ ఇంచుమించు అదే మాటలను చెప్పుచున్నది.

ఇస్కరియోతు యూదా ప్రభువును ఎట్లు అప్ప గించాడో, ఎట్లు తన ప్రాణాన్ని కోల్పోయాడో వచ్చే పాఠములో తెలిసికొందము.

ఈలోగా ఈ పుస్తకమును చదువుచున్న ప్రతి పురుషుడు, ప్రతిస్త్రీ తన హృదయాన్ని పరీక్షించుకో గోరు తాను. నీ హృదయంలో ప్రవేశము ఎవరికున్నది? యేసు ప్రభువుకా? లేక అపవాదికా? యేసు క్రీస్తును నీ హృద యంలో ప్రభువుగా ప్రతిష్ఠించుకో. ఆయనను నమ్మి ఈనాడే బాప్తిస్మము పొందు. మరణములోనుండి జీవములోనికి దాటు.

# 15. ఇస్కరియోతు యూదా - 2
## (Judas Iscariot)

యేసుప్రభువు, ఆయన శిష్యులు ఒక మేడ గదిలో పస్కాను భుజించుచుండిరి. ఆయన ఆత్మలో కలవరపడి మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని రూఢిగా చెప్పెను. ప్రభువా, వాడెవడని శిష్యులాయనను అడిగారు. అందుకు యేసు - నేనొక ముక్క ముంచి యెవని కిచ్చెదనో వాడే అని చెప్పి, ఒక ముక్క ముంచి సీమోను కుమారుడు ఇస్కరియోతు యూదాకిచ్చెను. వాడు ఆ ముక్క పుచ్చుకొనగానే సాతాను వానిలో ప్రవేశించెను. వాడు ఆ ముక్క పుచ్చుకొని వెంటనే బయటికి వెళ్లెను; అప్పుడు రాత్రివేళ (యోహాను 13 : 21-30).

అంతకు ముందే "పండ్రెండు మందిలో నొకడు ఇస్కరియోతు యూదా, ప్రధాన యాజకుల యొద్దకు వెళ్లి నేనాయనను మీకు అప్పగించిన యెడల నాకేమి యిత్తురని వారి నడిగెను. అందుకు వారు ముప్పది వెండి నాణెములు తూచి వాని కిచ్చిరి. వాడప్పటి నుండి ఆయనను అప్పగించుటకు తగిన సమయము కొరకు కనిపెట్టుచుండెను" (మత్తయి 26:14-16).

ఇస్కరియోతు వెళ్లిపోయిన తరువాత మిగిలిన 11 మంది శిష్యులకు యేసుప్రభువు అనేక సంగతులను వివరించి చెప్పాడు. ఆదరణకర్త యగు పరిశుద్ధాత్మని పంపుటకు

ఆయన వారికి వాగ్దానము చేసాడు (యోహాను 16:7, 13). అంతట యేసు వారితో కూడ గెత్సేమనే అనబడిన చోటుకి వచ్చి - నేను అక్కడికి వెళ్ళి ప్రార్థన చేసి వచ్చువరకు మీారిక్కడ కూర్చుండుడని శిష్యులతో చెప్పి పేతురును, జెబెదయి యిద్దరు కుమారులను వెంటబెట్టుకొని పోయి దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలు పెట్టెను. అప్పుడు యేసు మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగి యున్నది. మీారిక్కడ నిలిచి నాతో కూడ మెలకువగా యుండుడని వారితో చెప్పి తండ్రియైన దేవునికి ప్రార్థించుట మొదలిడెను. ఆయన మరల వచ్చి శిష్యులు నిద్రించుట చూచాడు. ఆయన ముమ్మారు తండ్రికి ప్రార్థన చేసాడు. శిష్యులు నిద్రభారములో మునిగిపోయారు (మత్తయి 26:36-46).

యేసు ప్రభువు ఆ పదకొండు మందిని మేల్కొలిపి నప్పటినుండి ఆయా సంఘటనలు త్వరగా జరిగిపోయాయి. "ఆయన ఇంకను మాటలాడుచుండగా పండ్రెండు మందిలో ఒకడగు యూదా వచ్చెను. వానితో కూడ బహు జనసమూహాములు కత్తులు గుదియలు పట్టుకొని ప్రధాన యాజకుల యొద్ద నుండియు, ప్రజల పెద్దల యొద్దనుండియు వచ్చెను. ఆయనను అప్పగించువాడు - నేనెవరిని ముద్దుపెట్టుకొందునో ఆయనే యేసు; ఆయనను పట్టుకొనుడని వారికి గురుతు చెప్పి, వెంటనే యేసునొద్దకువచ్చి - బోధకుడా నీకు శుభవచనమని చెప్పి ఆయనను ముద్దు పెట్టుకొనెను" (మత్తయి 26 : 46-50(.

ఇస్కరియోతు యూదా యేసుకు శుభవచనం పలుకు చున్నట్లేదో అగుపడ్డాడు, గాని అతడు పెట్టిన ముద్దు ద్వారా ఆయనను హింసించడానికి, కొట్టడానికి, విమర్శ చేయడానికి చివరికి కల్వరి కొండపై సిలువ వేయడానికి అప్పగించాడు. యూదా యేసుప్రభువును ముద్దు పెట్టినప్పుడు, పరలోకము నరకము కలసికొన్నాయి; దేవుని కుమారుని ముద్దు పెట్టి అప్పగించినప్పుడు నాశన పుత్రుడు మానవ చరిత్రలో అతిఘోరమైన కృత్యాన్ని జరిగించాడు.

యూదా కూడ వచ్చిన జన సమూహము యేసును పట్టుకొని అన్యాయపు తీర్పు తీర్చి ఆయనను సిలువవేసి చంపారు. "అప్పుడాయనను అప్పగించిన యూదా ఆయనకు శిక్ష విధింపబడగా చూచి పశ్చాత్తాపపడి, ఆ ముప్పది వెండి నాణెములు ప్రధాన యాజకుల యొద్దకును, పెద్దల యొద్దకును మరల తెచ్చి, నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారు దానితో మాకేమి నీవే చూచుకొనుమని చెప్పగా, అతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి పోయి ఉరి పెట్టుకొనెను. ప్రధాన యాజకులు ఆ వెండి నాణెములు తీసికొని, ఇవి రక్తక్రయ ధనము గనుక వీటిని కానుక పెట్టెలో వేయతగదని చెప్పుకొనిరి. కాబట్టి వారు ఆలోచన చేసి వాటినిచ్చి పరదేశులను పాతి పెట్టుటకు కుమ్మరి వాని పొలము కొనిరి" (మత్తయి 27:3-7).

యేసును అప్పగించినందున యూదా పశ్చాత్తాప పడ్డాడు, గాని అప్పటికే అంతా ఆలస్యమైపోయింది. అతడు యథార్థమైన మారుమనస్సు పొందలేదు. "దైవచిత్తాను సారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సు కలుగజేయును; ఈ మారుమనస్సు పశ్చాత్తాపము పుట్టించదు. అయితే లోక సంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2కొరింథీ 7 : 10). అతడు దుఃఖపడినను బహుశ ఈలోక రీత్యా దుఃఖ పడ్డాడు. పోయి ఆత్మహత్య చేసుకొన్నాడు. అతడు తల క్రిందుగా పడి నడిమికి బద్దలైనందున అతని పేగులన్నియు బయటికి వచ్చెను" అని అపో. కా. 1 : 18 చెప్పుచున్నది. యూదా చచ్చి తన చోటికి పోయాడు (అపో. కా. 1 : 25).

యూదా తిరిగి ఇచ్చిన ముప్పది వెండి నాణెములతో ప్రధాన యాజకులు పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరివాని పొలమును కొనిరని మనం తెలుసుకొన్నాము, అయితే ఈ సంగతి జరుగక కొన్నివందల సంవత్సరములకు ముందే ప్రవక్తయైన జెకర్యా దాన్ని గూర్చి ఇట్లు ప్రవచించాడు: "మీకు అనుకూలమైన యెడల నా కూలి నాకియ్యుడి, లేనియెడల మాని వేయుడని నేను వారితో అనగా వారు నా కూలికై ముప్పది తులముల వెండి తూచి యిచ్చిరి. యెహోవా-ఎంతో అబ్బురముగా వారు నా కేర్పరచిన క్రయ ధనమును కుమ్మరికి పారవేయుమని నాకు ఆజ్ఞ ఇయ్యగా నేను ఆ ముప్పది తులముల వెండిని తీసికొని యెహోవా మందిరములో కుమ్మరికి పారవేసితిని" (జెకర్యా 11 : 12, 13).

ఇస్కరియోతు యూదా మరణంలో క్రీస్తునుండి అతడు ఎన్నటికీ వేరై పోయాడు. దేవుని కృపవలన మాత్రమే మానవుడు ఎంత ఘోర దుష్క్రియకైనను క్షమాపణ పొందవచ్చునని అతడు మరిచాడు (ఎఫెసీ 2 : 8-10).

ఎప్పటికీ క్షమించబడలేని వారిలో యూదా ఉన్నాడని మనం అనుకొనుచున్న యెడల, సిలువ యొక్క అపరాధం కేవలం అతనిది మాత్రమే కాదు. యూదాకు వేరైన తరగతిలో మనలను మనం ఉంచుకోలేము. ఎందువలనంటే మన కోరికలు నెరవేర్చుకోడానికి వేయి విధములుగా మనం క్రీస్తును అప్పగించుచునేయున్నాము.

యేసుప్రభువు శిష్యులమని చెప్పుకొనుచున్నను అపవాదికి లొంగి పాపం చేసే ప్రమాదం మనకు లేకపోలేదని యూదా చెప్పుచున్నాడు. అందువలననే "తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెనని" 1 కొరింథీ 10 : 12 చెప్పుచున్నది. పైకి భక్తిపరులుగా కనబడుచున్నను కొందరు నశించిన స్థితిలో యుంటారని యూదా మనకు తెలియజేయుచున్నాడు. తరువాత మనం చేసిన దుష్క్రియలను గూర్చి మారుమనస్సు పొందేసరికి చాల ఆలస్యం ఆశాభంగం కాగలదని తెలిసికొందాము: "ఒకసారి వెలిగింపబడి పరలోక సంబంధమైన వరమును రుచి చూచి, పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్య వాక్యమును, రాబోవు యుగ సంబంధమైన శక్తులను

అనుభవించిన తరువాత తప్పిపోయిన వారు, తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువవేయుచు, బాహాటముగా ఆయనను అవమాన పరచుచున్నారు గనుక మారుమనస్సు పొందునట్లు అట్టి వారిని మరల నూతన పరచుట అసాధ్యము" (హెబ్రీ 6 : 4-6).

ఈ విషయంలో నీవు అపరాధివా ? ఈ రోజే మారుమనస్సు పొందుము, రేపటికి చాల ఆలస్యం ! !

## 16, అపొస్తలుని చిహ్నములు

## ( *The Signs of an Apostle* )

అపొస్తలులను గూర్చి గత పాఠములలో మనము కొంత నేర్చుకొని యున్నాము. అందరికంటె ఆఖరున పిలువబడిన అపొస్తలుడు పౌలనియు, అతడు అన్యజనులకు క్రీస్తు సువార్త బోధించుటకు పిలువబడెననియు గ్రహించి యున్నాము. క్రీస్తు ఏర్పరచుకొనిన అపొస్తలులలో పౌలు ఆఖరివాడు. ఈనాడు తమకు తామే అపొస్తలులని పిలువబడువారు దొంగ అపొస్తలులు. "ఏల యనగా అట్టివారు క్రీస్తు యొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారై యున్నారు" అని 2 కొరింథీ 11:13 లో చెప్పబడి యున్నది. అందునుబట్టి నిజమైన అపొస్తలుని యొక్క చిహ్నములను మన మెరుగవలెను. ఎవడైనను అపొస్తలునిగా ఏర్పరచుకొనబడవలెనంటె అట్టివాడు యోహాను బాప్తిస్మమిచ్చినది మొదలుకొని ప్రభువైన యేసు పరలోకమునకు చేర్చుకొనబడిన దినమువరకు ఆయనతో సంచరించుచు, ఆయన పునరుత్థానమును గూర్చి సాక్షియై యుండవలెను (అపొ.కా. 1:22). అందువలన ఇప్పటికింకను జీవించుచున్న అపొస్తలులు మన మధ్య లేరు.

అపొస్తలుని యొక్క చిహ్నము లేవి? సూచక క్రియలను, అద్భుతములను, మహాత్కార్యములను చేయుటవలన అపొస్తలుని యొక్క చిహ్నములు నిజముగా కనపరచబడెనని

2 కొరింథీ 12:12 లో అపొ. పౌలు చెప్పెను. అపొస్తలుడు దేవునిచే పిలువబడవలెను. అతడు మనుష్యునివలనగాని, మనుష్యుని మూలముగాగాని పిలువబడినవాడు కాదు (గలతీ 1:1). అపొస్తలుడు క్రీస్తు పునరుత్థానమును గూర్చి సాక్షియై యుండవలెను (అపొ.కా. 1:22). పునరుత్థానుడైన క్రీస్తు అందరికంటె ఆఖరున పౌలుకు కనబడెను (1 కొరింథీ 15:8) అపొస్తలుడు దైవావేశము కలిగినవాడై యుండవలెను (లూకా 24:47-49; అపొ.కా. 1:8; గలతీ 1:12). అతడు అద్భుతములు చేయు శక్తిని, అన్యభాషలు మాట్లాడు శక్తిని కలిగియుండవలెను (అపొ.కా. 2:43; 2 4; హెబ్రీ 2:4). ఈనాడు జీవించుచున్న మానవులలో యెవడును ఈ చిహ్నములను కలిగి యుండలేదు. లేఖనముల ద్వారా తప్ప ఈనాడు అపొస్తలులు మన మధ్య లేరు. తాను అపొస్తలుడనని యెవడైన చెప్పుకొనుచున్న యెడల అట్టివానిచే మనము మోసగించబడనవుసరము లేదు.

అపొస్తలులు ఈ లోకమునకు తీర్పు తీర్చుదురని యేసు ప్రభువు చెప్పెను. "ప్రపంచ పునర్జననమందు మనుష్యకుమారుడు తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనములమీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి తీర్పు తీర్చుదురు" అని యేసు అపొస్తలులతో అనెను (మత్తయి 19:28). తీర్పరి న్యాయ శాస్త్రమును, చట్టమును అమలుపరచును. శిక్ష విధించును. ధర్మశాస్త్ర మేమిటో

తెలియజెప్ప నిపుణులు అపొస్తలులు. ఒక ప్రత్యేక విధముగ అపొస్తలులు ఈ లోకానికి తీర్పు తీర్చి యున్నారు. వారు దుష్టుల యొక్క నాశనమును, నీతిమంతుల రక్షణను ప్రకటించి యున్నారు.

అపొస్తలులు క్రీస్తు పునరుత్థానము యొక్క సాక్షులు. మృతులలోనుండి సజీవుడై లేచిన క్రీస్తు "ఈ సంగతులకు మీరే సాక్షులు", "పరిశుద్ధాత్మ, మీ మీదికి వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతములవరకును నాకు సాక్షులై యుందురు" అని వారితో చెప్పెను (లూకా 24:48; అపొ.కా. 1:8). యేసు జీవించిన జీవితమును గూర్చియు, ఆయన పనులను గూర్చియు, పునరుత్థానమును గూర్చియు సాక్ష్య మీయగలిగిన వారెవరును ఈనాడు లేరు. సాక్షియైనవాడు తాను సాక్షాత్తుగా కన్న వాటిని విన్న వాటిని తాకినవాటిని గూర్చి సాక్ష్యమియ్యగలడు. క్రీస్తు కాలములో జీవించిన వారెవరును ఇప్పటికింకా జీవించి లేరు గనుక ఆయనను గూర్చి సాక్షులైనవారు ఈనాడు లేరు. అయితే ఆయనతో కలసి మెలసి జీవించినవారు వ్రాసిన లేఖనములు మనకీనాడున్నవి. లేఖనముల ద్వారా వారింకను క్రీస్తును గూర్చి సాక్ష్య మిచ్చుచునే యున్నారు. లేఖనములలో వారిచ్చిన సాక్ష్యమును ఇతరులకు చాటుటయే మన విధి. పరిశుద్ధాత్మావేశమువలన వారు లిఖించిరి గనుక వారి సాక్ష్యము యథార్థమైనది.

అపొస్తలులు క్రొత్త నిబంధనకు పరిచారకులని వ్రాయబడి యున్నది. వారు పాతనిబంధనకు గాక క్రొత్త నిబంధనకు పరిచారకులని అపో.పౌలు చెప్పుచున్నాడు. "ఆయనే మమ్మును క్రొత్త నిబంధనకు, అనగా అక్షరమునకు కాదుగాని ఆత్మకే పరిచారకులమవుటకు మాకు సామర్థ్యము కలిగించియున్నాడు. అక్షరము చంపునుగాని ఆత్మ జీవింపజేయును" అని అతడు చెప్పెను (2 కొరింథీ 3:6). "కాబట్టి ఈ పరిచర్య (అనగా క్రొత్త నిబంధన పరిచర్య) పొందినందున కరుణింపబడిన వారమై అధైర్యపడము" అని 2 కొరింథీ 4:1 లో అతడు మరల వ్రాసెను. దేవుని మహిమను గూర్చిన జ్ఞానము క్రీస్తు యేసునందు వెల్లడి పరచబడెను. ఆ వెలుగైన క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, వారు యేసు నిమిత్తము పరిచారకులనియు ప్రకటించుట వారి పరిచర్య ఆయెను (2 కొరింథీ 4 : 5, 6).

అపొస్తలులు మంటి ఘటముల వంటివారు. వారు సువార్త ఈ లోకమునకు చాటు నిమిత్తము మంటిఘటములలో ఉంచబడినట్లు సువార్త వారిలో ఉంచబడెను. ఈ లోకానికంతటికి సువార్త ప్రకటించునట్లు యేసు దేవదూతల నేర్పరచుకొనలేదు. అట్లయిన యెడల ప్రజలు సువార్తకుగాక ఆ వర్తమానము తెచ్చిన దూతలకే ప్రాముఖ్యత నిత్తురు. సరిగదా రక్షించుశక్తి సువార్తలోగాక ఆ వర్తమానము తెచ్చిన దూతలలోనే యున్నదని తలంతురు. అయితే దేవుడు సువార్తకును దానిలో యున్న రక్షించే శక్తికిని ప్రాముఖ్యత

నొసగెను. అందువలన ఆయన మనవలెనే బలహీనతలతో నిండియున్న మంటి ఘటములగు మానవులను సువార్త ప్రకటించుటకు ఏర్పరచుకొనెను. వారిలో రక్షించే శక్తి ఏమియును లేదు. "అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" అని 2 కొరింధీ 4:7 లో పౌలు వ్రాసెను. మీరు సర్వలోకమునకు వెళ్ళి సువార్త ప్రకటించుడి యను ఆజ్ఞను యేసుక్రీస్తు దేవదూతలకు కాక మానవమాత్రులగు అపొస్తులులకే యిచ్చెను. ఆ మహిమగల దేవుని సువార్తను చాటే బాధ్యత ఇప్పటి కింకను మానవులకే ఈయబడి యున్నది.

అపొస్తలులు క్రీస్తుకు రాయబారులు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను; సమస్తమును దేవునివలననైనవి; ఆయన మనలను క్రీస్తుద్వారా తనలో సమాధానపరచుకొని, ఆ సమాధానపరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను. కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్టు మేము క్రీస్తుకు రాయబారులమై దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము. ఎందుకనగా మన మాయన యందు దేవుని నీతి అగునట్లు పాప మెరుగని

ఆయనను మనకోసము పాపముగా చేసెను" అని అపొ. పౌలు వ్రాసెను (2 కొరింథీ 5:18-21).

సమాధాన పరచు పరిచర్యను దేవుడు అపొస్తలుల కిచ్చెనని పౌలు ప్రకటించుచున్నాడు. ఈ లోకము దేవునితో సమాధాన పడవలెననిన వారు మారుమనస్సు పొందిన విశ్వాసులై దేవునికి విధేయులు కావలెను. సువార్తను ప్రకటించుట ద్వారా అపొస్తలులు సమాధానపరచు క్రియను సాధించిరి. వారు క్రీస్తు పక్షముగా దేవునితో సమాధానపడుడని ప్రజలను వేడుకొనుటద్వారా క్రీస్తుకు రాయబారులైరి.

క్రీస్తు సువార్త సమాధాన సువార్త. పాపియైన మానవుని దేవునితో సమాధాన పరచు సువార్త అది. అపొస్తలుల ద్వారా లోకానికి అంతటికి ప్రకటింపబడిన సువార్త అది. దానిని నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడునని క్రీస్తు చెప్పెను. నీవు సువార్తకు లోబడితివా?

---

## 17. అపొస్తలుల పని

### ( *The work of the Apostles* )

అపొస్తలుల యేర్పాటును గూర్చి వారి విధులను గూర్చి గత పాఠములలో కొంత నేర్చుకొని యున్నాము. ఈ రోజు వారిని గూర్చి మరికొంత తెలిసి కొందము.

క్రీస్తు వారితో యున్నప్పుడు అపొస్తలులకు గొప్ప శక్తి, అధికారము ఇయ్యబడునని సూచించెను. పేతురుతో యేసు ఇట్లనెను: "పరలోక రాజ్యముయొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేనిని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేనిని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" (మత్తయి 16:19). దీనిని బట్టి ఈ శక్తి లేక అధికారము పేతురుకు మాత్రమే ఇయ్యబడెనని మనము తలంచరాదు. మొట్ట మొదటి సువార్త ప్రసంగమును యూదులకు, అన్యజనులకు ప్రసంగించే తరుణము పేతురుకే ఇయ్యబడినను, ఈ ప్రత్యేక శక్తిని క్రీస్తు మిగిలిన అపొస్తలుల కందరికీ యిచ్చెను. క్రీస్తు శిష్యులు తాము కూడియున్న యింటి తలుపులు మూసికొని యుండగా పునరుత్థానుడైన క్రీస్తు వారి మధ్యకు వచ్చి, "మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచి యుండనిత్తురో అవి నిలిచి యుండు నని వారితో చెప్పెను" (యోహాను 20:23).

పరలోక రాజ్యపు తాళపు చెవులు మీకిచ్చెద ననుటలో, పరలోక రాజ్యములో అధికారమును ఆయన వారికిచ్చెను. ఒక నిజమైన వార్తా వాహుడు క్రీస్తుచే ఏర్పరచుకొనబడి పంపబడిన యెడల అతడు యేసుయొక్క వర్తమానమును అందించును. అందువలన యేసు తన శిష్యులతో, "మీ మాట వినువాడు నా మాట వినును, మిమ్మును నిరాకరించువాడు నన్ను నిరాకరించును, నన్ను నిరాకరించువాడు నన్ను పంపిన వానిని నిరాకరించు ననెను" (లూకా 10:16). అపొస్తలులకు గొప్ప శక్తి ఈయబడెను నిజమే, గాని వారు దానిని వినియోగించుటకు తగిన రీతిగా సిద్ధపరచబడిన తరువాత మాత్రమే వారికా శక్తి ఈయబడెను.

యేసుయొక్క అపొస్తలులు మొదటి నుండి ఆయనతో యుండిరి. మొదట శిష్యులుగాను తరువాత అపొస్తలులుగాను వారు ఏర్పరచుకొనబడిరి. ఆయన ఈ లోకములో బహిరంగ పరిచర్య చేసినంత కాలము వారాయనతో కలసి యుండిరి. ఆయన వారికి బోధించెను, ఉపదేశించెను, తగు శిక్షణ నిచ్చెను. ఆయన వారి కనేక సంగతులను గూర్చి పరలోక రాజ్యపు మర్మములను గూర్చి బోధించెను. వారు ప్రార్థించుట యెట్లో కూడ ఆయన వారికి నేర్పించెను (మత్తయి 6:5-15).

వారు యేసు దగ్గర పొందిన శిక్షణ కొద్ది కాలమే అయినను వారి కప్పగింపబడిన పనిని సాధించుట కది సరిపోదు. వారి జ్ఞాపకశక్తి సంకుచితమైనది. అందువలన వారు బహుశ మరచిపోవచ్చును. వారికున్న ఈ మానవ బలహీనతను

జయించు నిమిత్తము యేసు వారికి ఒక ఆదరణకర్తను వాగ్దానము చేసెను: "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును". "ఆయన, అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియ జేయును" (యోహాను 14:26; 16:13).

మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యని యేసు అపొస్తలులకు చెప్పినను, వారు పరిశుద్ధాత్మను, ఆయనయొక్క అద్భుత శక్తిని పైనుండి పొందే వరకు తమ సర్వలోక సృష్టిని ఆరంభించలేదు. ఇందు విషయమై యేసు వారి కిట్లు బోధించెను: "క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనులలో ఆయన పేరట మారుమనస్సును పాప క్షమాపణయు ప్రకటింప బడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:47-49). వారు నిలిచి యుండవలసిన పట్టణము యెరూషలేము. మరల "ఆయన వారిని కలసికొని యీలాగు ఆజ్ఞాపించెను - మీరు యెరూషలేమునుండి వెళ్ళక

నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కని పెట్టుడి...కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను" (అపొ.కా. 1:4, 5).

అపొస్తలులు యెరూషలేములో యుండిరి. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు, మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని" ఆయన వారితో చెప్పెను (అపొ. కా. 1:8).

కొన్ని దినముల తరువాత పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అది యెరూషలేము. "అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వారు కూర్చుండి యున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింప బడినట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించినకొలది అన్య భాషలతో మాటలాడ సాగిరి" (అపొ.కా. 2:1-4).

అపొస్తలు లప్పుడు ప్రభువు నిర్ణయించిన స్థలములో యుండిరి, వారు పని ఆరంభించే సమయము ఆసన్నమయినది. యేసు వాగ్దానము చేసినట్లు వారు పరిశుద్ధాత్మను పొందిరి. తద్వారా శక్తిని పొందిరి. జనసమూహములు వారి యొద్దకు

రాగా పేతురు వారికి మొట్టమొదటి సారిగ క్రీస్తు సువార్తను బోధించెను. యేసే దేవుని కుమారుడనియు, జగద్రక్షకుడనియు అతడు వారికి నిరూపించెను. అతని మాటలను విని విశ్వసించినవారు సహోదరులారా, మేమేమి చేతుము? అని పేతురును మిగిలిన అపొస్తలులను అడిగిరి. అందుకు పేతురు "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను. "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడు వేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:38, 41). పేతురు ఆనాడు ఏ షరతులను విధించెనో పాప విముక్తి కొరకు అవే షరతులు నేటికిని నిలిచి యున్నవి.

నీవు నీ పాపములనుండి రక్షణ పొందగోరుచున్నావా? అయితే క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాప క్షమాపణ కొరకు బాప్తిస్మము పొందుము. ప్రభువు నిన్ను తన సంఘములో చేర్చుకొని దీవించును. నీవు సువార్తకు లోబడ గోరుచున్నావా?

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.